epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

సంపుటి : 19 సంచిక : 71 | 24-05-2026 ఆదివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 8 వెల : రూ.1.00




## బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు..

# ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు

### హరీష్ వ్యాఖ్యలపై పొంగులేటి కౌంటర్



బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. లాగే మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి ఫ్యూచర్ సిటీని ఆపేస్తామంటూ హరీశ్‌రావు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు.

వార్త 2లో

## సెంట్రింగ్ కార్మికుల

# సమ్మెకు మద్దతు

### వారి సమస్యలు పరిష్కరించాలన్న కవిత



సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. సెంట్రింగ్ కార్మికులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. శనివారం ఇందిరాపార్క్ వద్ద జరుగుతున్న గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ గుత్తేదారుల అసోసియేషన్ మహాధర్నాకు కవిత మద్దతు ప్రకటించారు.

వార్త 2లో

## యాదాద్రిలో సరికొత్త

# "ఆధ్యాత్మిక శోభ"



- రూ.99.55 కోట్లతో అనుబంధ పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన
- 15 ఎకరాల విస్తీర్ణంలో మూడు దశల్లో వేద పాఠశాల నిర్మాణం
- 500 మంది విద్యార్థులకు ఉచిత విద్య, వసతి సౌకర్యాలు
- కంచి స్వామి పర్యవేక్షణలో భూమి పూజ
- హాజరైన శాసన మండలి చైర్మన్, మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి భువనగిరి జిల్లాలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయం మరింతగా ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది. శనివారం యాదాద్రి కొండపై రూ.99.55 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘనంగా శంకుస్థాపన చేశారు.ముందుగా కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి పర్యవేక్షణలో, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అత్యంత వైభవంగా వేద పాఠశాల భూమి పూజ కార్యక్రమం జరిగింది. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మిగిలిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనల శిలాఫలకాలను ఆవిష్కరించారు. అభివృద్ధి పనులు మొత్తం రూ.99.55 కోట్ల నిధులతో చేపట్టనున్నారు.

వార్త 6లో



## తెలంగాణ ఎండల తీవ్రతపై


# ప్రభుత్వం అలర్ట్

- వడదెబ్బకు 16 మంది మృతి చెందినట్లు గుర్తింపు
- మృతుల కుటుంబాలకు 4లక్షల చొప్పున పరిహారం
- పరిస్థితిపై అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష



రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్‌పై హై అలర్ట్ ప్రకటించినట్లు తెలంగాణ రెవెన్యూ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తీవ్ర ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి సచివాలయంలో శనివారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. వడగాల్పులతో 7 జిల్లాల్లో 16 మంది మృతిచెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నష్టపరిహారం ఇస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే మూడు రోజులు మరింత తీవ్రంగా హీట్ వేవ్ ఉండనుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశర చేశారు.

వార్త 2లో




# పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు

- ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధమైనట్లుగా వార్తలు
- తమ గగన తలాన్ని మూసేస్తూ ఇరాన్ ఆదేశాలు

వార్త 2లో

# ట్రంప్ కుమారుడు జూనియర్ వివాహం

### ప్రస్తుత పరిస్థితుల్లో హాజరు కాలేనన్న ట్రంప్



వాషింగ్టన్,

ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగనున్న తన పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి తాను హాజరుకాక పోవచ్చని పేర్కొన్నారు. ఆ వేడుకకు హాజరైనా.. హాజరుకాకపోయినా తప్పుడు వార్తలతో తనను చంపేస్తారని చమత్కరించారు. అందుకే వివాహానికి హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని.. అయితే ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో అది కష్టంగా మారే అవకాశం ఉందని తెలిపారు. 48 ఏళ్ల డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఈ వారాంతంలో తన ప్రియురాలు బెట్టినా ఆండర్సన్‌ను వివాహం చేసుకోనున్నారు. ఈ వేడుక బహామాస్‌లో జరగనుంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ వివాహానికి సన్నిహితులను మాత్రమే ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ట్రంప్ జూనియర్ 2005లో వెనెసాను వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వీరి మధ్య విభేదాలు రావడంతో 13 ఏళ్ల తమ వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ 2018లో విడాకులు తీసుకున్నారు. వీరికి ఐదుగురు సంతానం. 2020లో ట్రంప్ జూనియర్‌కు ఫాక్స్‌న్యూస్ మాజీ హోస్ట్ కింబర్లీతో నిశ్చితార్థం జరగ్గా.. తర్వాత దానిని రద్దు చేసుకున్నారు. అనంతరం మోడల్, సామాజికవేత్త అయిన బెట్టినా ఆండర్సన్‌తో ట్రంప్ జూనియర్ గతేడాది ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు.



# మాసాబ్ ట్యాంక్‌లో దారుణ ఘటన

న్యాయవాదిని కారుతో ఢీకొటి చంపిన దుండుగుల

కారు నంబర్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

2

# యాదగిరిగుట్టలో సీఎం పర్యటన

## వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ



యాదగిరిగుట్ట, అక్షరకలం ప్రతినిధి

యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శనివారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేద పాఠశాలకు రేవంత్ శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో కలిసి వేదపాఠశాలకు భూమిపూజ చేశారు.





అనంతరం రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గం పై కప్పు నిర్మాణానికి, రూ.1.35 కోట్లతో నిర్మించనున్న రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఉదయం ప్రత్యేక హెలికాప్టర్లో యాదగిరిగుట్ట పెద్దగుట్టపైకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి.. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. సీఎంతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేంనరేందర్ రెడ్డి.. యాదాద్రికి చేరుకున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంప్రదాయ వేదపాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపది శ్రీశంకర విజయేంద్ర సర్వస్వతి స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో వేదపాఠశాల భవనం నిర్మించనున్నారు. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించనున్నారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని సీఎం దర్శించుకున్నారు.

## బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు

### హరీష్ వ్యాఖ్యలపై పొంగులేటి కౌంటర్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. లాగే మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి ఫ్యూచర్ సిటీని ఆపేస్తామంటూ హరీశ్‌రావు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పొంగులేటి పోస్టు పెట్టారు. బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు అంటూ కౌంటర్ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ భూములపై అమెరికాలో ఎవరికైనా ఒప్పందాలు చేసుకున్నారా..? అంటూ నిలదీశారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఒక్క మెట్రోస్టేషన్ కూడా ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా కొత్త నగరాన్ని నిర్మిస్తోందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబం ఫాంహౌస్‌లు కట్టుకుందని.. కానీ తాము రాష్ట్ర భవిష్యత్తు కోసం ఫ్యూచర్ సిటీ కడుతున్నామని ఉద్ఘాటించారు. మూసీప్రక్షాళన, లగచర్ల ఇండస్ట్రీస్‌కు బీఆర్ఎస్ నేతలు అడ్డుపడ్డారని ఆగ్రహించారు. యువతకు ఉద్యోగాలు కల్పించే ప్రయత్నాలను కుట్రలతో అడ్డుకున్నారని ÷ర్ అయ్యారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశం గర్వించే విధంగా తాము ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు రాజకీయ భవిష్యత్తు ఖతం చేయాలని బీఆర్ఎస్ నేతలే చూస్తున్నారని సెటైర్లు గుప్పించారు.

## సెంట్రింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు

### వారి సమస్యలు పరిష్కరించాలన్న కవిత

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. సెంట్రింగ్ కార్మికులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. శనివారం ఇందిరాపార్క్ వద్ద జరుగుతున్న గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ గుత్తేదారుల అసోసియేషన్ మహాధర్నాకు కవిత మద్దతు ప్రకటించారు. ఈ ధర్నాకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జనసేన రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. రెండు రోజుల్లో సెంట్రింగ్ కార్మికుల నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించాలని కవిత డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించకపోతే రెండు రోజుల తర్వాత తానే స్వయంగా ధర్నాలో కూర్చుంటానని స్పష్టం చేశారు. సెంట్రింగ్ కార్మికుల డిమాండ్లు గొంతెమ్మ కోరికలు కావని.. న్యాయమైనవేనని చెప్పుకొచ్చారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని మాటిచ్చారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే కచ్చితంగా విద్య, వైద్యం అందిస్తామని కవిత స్పష్టం చేశారు.

## తెలంగాణ ఎండల తీవ్రతపై ప్రభుత్వం అలర్ట్


### వడదెబ్బకు 16 మంది మృతి చెందినట్లు గుర్తింపు

### మృతుల కుటుంబాలకు 4లక్షల చొప్పున పరిహారం

### పరిస్థితిపై అధికారులతో మంత్రి పొంగులేటీ సమీక్ష

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్‌పై హై అలర్ట్ ప్రకటించినట్లు తెలంగాణ రెవెన్యూ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తీవ్ర ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి సచివాలయంలో శనివారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. వడగాల్పులతో 7 జిల్లాల్లో 16 మంది మృతిచెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నష్టపరిహారం ఇస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే మూడు రోజులు మరింత తీవ్రంగా హీట్ వేవ్ ఉండనుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశర చేశారు. ప్రజల ప్రాణ రక్షణెళి తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని తెలిపారు. వడగాల్పులతో ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదని చెప్పుకొచ్చారు. ఎండ తీవ్రతపై ప్రజలకు గంట గంటకు హెచ్చరికలు జారీ చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని నిర్దేశిరచారు. హీట్‌వేవ్‌పై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎండదెబ్బకు గురైన వ్యక్తులకు ఆయా ఆస్పత్రులు అత్యవసర చికిత్స అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇదిలావుంటే తెలంగాణలో భానుడి భగభగలు తీవ్రరూపం దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండగా, 18కు పైగా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. పరిస్థితి తీవ్రంగా మారడంతో అధికారులు 18 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ లోనూ ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి 43 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు జిల్లాలు తీవ్ర వడగాలుల ప్రభావానికి గురవుతున్నాయి. వడదెబ్బ ప్రభావం ఆందోళనకరంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ కారణంగా 34 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా అలసటగా ఉంటుంది, గాలిలో తేమ ఎక్కువగా ఉండటం, వేడిగా ఉన్నప్పుడు ఎక్కువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. కండరాల నొప్పి ఉంటుంది. హీట్ ఇంజురీలో శరీర భాగాలు దెబ్బతినే అవకాశం ఉంది. కిడ్నీ, గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది. హీట్ స్ట్రోక్ తీవ్రమైన సమస్య.. దీనిలో శరీర భాగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. దీని కారణంగా మెదడు పనితీరు దెబ్బతింటుంది. స్ట్రోక్ సంభవించవచ్చు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే.. కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఈ వడదెబ్బ నుంచి



తప్పించుకోవాలంటే.. శరీరాన్ని ఎప్పుడూ హైడ్రేట్‌గా ఉంచుకోవాలి. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. మధ్యాహ్నం పూట బయటకు వెళ్లకపోవడం మంచిది. షుగర్, బీపీ పేషెంట్లు మెడికేషన్ సక్రమంగా తీసుకోవాలి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు బయట తిరగకపోవడమే మంచిది. అత్యవసర పరిస్థితిలో వెళ్లాల్సి వస్తే.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముదురు రంగు దుస్తులు కాకుండా తేలికపాటి లేత రంగు దుస్తులను ధరించాలి. ఆల్కాహాల్ శరీరంలోని నీటి శాతాన్ని తగ్గిస్తాయి. ఎండాకాలంలో మద్యానికి దూరంగా ఉండటం మంచిది. ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, ఉప్పు కలిపిన నిమ్మరసం లాంటివి శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి భర్తీ చేస్తాయి. దోసకాయలు, పుచ్చకాయలు, దానిమ్మ, బత్తాయి లాంటి పండ్లు తీసుకోవాలి. వేసవిలో తేలికపాటి వ్యాయామాలు ఉదయం 8 గంటల్లోపే ముగించాలి. వడదెబ్బ లక్షణాలు కనిపించగానే చికిత్స అందించాలి. లేదంటే శరీరం పూర్తిగా నిర్జలీకరణం చెంది.. బీపీ, పల్స్ పడిపోయి కొన్నిసార్లు ప్రాణాలు పోవచ్చు.

## పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు

### ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధమైనట్లుగా వార్తలు

### తమ గగన తలాన్ని మూసేస్తూ ఇరాన్ ఆదేశాలు

టెహ్రాన్, అక్షరకలం ప్రతినిధి

పశ్చిమాసియాలో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. ఓవైపు చర్చలు కొనసాగుతుండగానే.. ఇరాన్‌పై మరోసారి దాడికి దిగేందుకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వార్తలు వెలువడ్డాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. దేశంలోని పశ్చిమ ప్రాంతం వైపున్న గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇరాన్ పౌర విమానయాన సంస్థ విమానయాన సిబ్బందికి నోటమ్ జారీ చేసింది. ఈనెల 25 వరకు అన్ని విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఈ నోటమ్ జారీ చేసే సమయంలో ఖతార్ ప్రభుత్వానికి చెందిన ఓ వీఐపీ విమానం ఇరాన్ గగనతలాన్ని దాటింది. ఆ విమానం శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చల కోసం టెహ్రాన్‌కు వచ్చిన ఖతార్ ప్రతినిధి బృందానికి చెందినదిగా తెలుస్తోంది. ఇక, అమెరికా- ఇరాన్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందానికి సంబంధించిన చాలా అంశాల్లో ఇరుదేశాల మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది. దీంతో ఏ క్షణమైనా ఒప్పంద ప్రకటన వెలువడే అవకాశముంది. అదే సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు చివరి నిమిషంలో విఫలమైతే.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ఇరాన్ కూడా తన గగనతలాన్ని మూసివేయడంతో.. పశ్చిమాసియాలో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా మరోసారి దాడులకు సిద్ధం అవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరాన్ ఇలా అప్రమత్తమైంది.



ఈ పరిణామంతో గల్ఫ్‌లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. యూఎస్ మరోసారి యుద్ధాన్ని ప్రారంభించిన పక్షంలో దీటుగా ఎదుర్కొనేందుకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, ఇతర సాయుధ దళాలు సిద్ధమవుతున్నట్టు ఇరాన్ వార్తా సంస్థ తస్నిమ్ ఒక కథనాన్ని ప్రచురించింది. అమెరికా ఆస్తులకు నష్టం కలిగేలా, ప్రయోజనాలు దెబ్బతినేలా దాడులకు ప్రణాళికలను ఇరాన్ మిలిటరీ సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ వారాంతాన్ని న్యూజెర్సీలో గడపాల్సిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చివరి నిమిషంలో తన ప్లాన్స్‌ను అకస్మాత్తుగా రద్దు చేసుకుని రాజధాని వాషింగ్టన్‌కు తిరిగొచ్చారు. దీంతో, పశ్చిమాసియాలో మళ్లీ ఘర్షణలు మొదలవుతాయన్న వార్తలు మీడియాలో వెలువడ్డాయి. ఈ వారాంతంలో మెమోరియల్ డే వేడుకల్లో పాల్గొనాల్సిన అమెరికా నిఘా సంస్థల సీనియర్ అధికారులు కూడా తమ ప్రణాళికలను రద్దు చేసుకుని వాషింగ్టన్‌కు తిరిగొచ్చేశారు. రాబోయే 24 గంటల్లో దౌత్యపరమైన పురోగతి లేని పక్షంలో దాడులు మొదలుపెట్టేందుకు ట్రంప్ కూడా సుముఖంగానే ఉన్నట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పరిస్థితులు అంతకంతకూ ఉద్రిక్తంగా మారుతున్నా తెరవెనుక దౌత్యమార్గాల్లో ప్రయత్నాలు ముమ్మర స్థాయిలో జరుగుతున్నట్టు కూడా తెలుస్తోంది. చర్చల్లో కొంత పురోగతి కనిపించిందని విశ్వసనీయ వర్గాలు చెప్పినట్టు తస్నిమ్ వార్తా సంస్థ పేర్కొంది.

## మాసాబ్ ట్యాంక్‌లో దారుణ ఘటన

### న్యాయవాదిని కారుతో ఢీకొటి చంపిన దుండుగుల

### కారు నంబర్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో న్యాయవాది ఖాజా మొహియుద్దీన్‌పై ప్రత్యర్థులు దాడికి తెగబడ్డారు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన న్యాయవాదిని దుండగులు కారుతో బలంగా ఢీకొట్టారు. పక్కా ప్లాన్‌తో న్యాయవాది కోసం వేచి చూస్తున్న దుండగులు.. ఖాజా మొహియుద్దీన్ బయటకు వచ్చిన వెంటనే అత్యంత వేగంగా వచ్చి ఢీకొట్టి పరారయ్యారు. కారు ఢీకొట్టిన వెంటనే న్యాయవాది గాల్లోకి ఎగిరి కిందపడ్డారు. దీంతో ఆయనకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు.. మొహియుద్దీన్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.అయితే ఆయన అప్పటికే మృతి చెందారు. న్యాయవాదిపై హత్యాయత్నం దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. న్యాయవాదిపై దాడి సమాచారం తెలుసుకున్న తోటి న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాజా మొహియుద్దీన్‌ను కారుతో ఢీకొట్టిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇది న్యాయవ్యవస్థపైనే దాడి అని వారు అభివర్ణించారు. ఈ ఘటనపై నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. న్యాయవాదిపై దాడికి గల కారణాలు, ఆయనపై ఎవరు దాడి చేశారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కారు నంబర్ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇకపోతే మాసబ్‌ట్యాంక్ వద్ద కారు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ కన్నుమూశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ న్యాయవాది తుదిశ్వాస విడిచారు. న్యాయవాది తన కారు వద్దకు వచ్చి వెనక సీట్లో బ్యాగు పెట్టి.. డ్రైవింగ్ సీట్‌లో కూర్చోబోతున్న సమయంలో ఒక్కసారిగా దుండగులు



కారుతో అతివేగంగా దూసుకొచ్చి బలంగా ఢీకొట్టారు. క్షణాల్లోనే ఈ ఘటన చోటు చేసుకుంది. న్యాయవాదికి తీవ్రమైన గాయాలవడంతో వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే న్యాయవాది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చివరకు చికిత్స పొందుతూ మొయునుద్దీన్ ప్రాణాలు కోల్పోయారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. కారు నంబర్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

# దైనందిన జీవితంలో వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య**



**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 23:**

ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొంత సమయం వ్యాయామం, యోగ కు కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువజన క్రీడా ముగింపు కార్యక్రమానికి జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంతరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ రమేష్, ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. 18వ తేదీన ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ, మారథాన్ – ఫిజికల్ లిటరసీ, 19వ తేదీన కెరీర్ అండ్ స్కిల్ డెవలప్మెంట్ – ఎం పవర్ స్కిల్స్, ఎం పవర్ ఫ్యూచర్, 20వ తేదీన యూత్ లీడర్ షిప్ సమ్మిట్, 21వ తేదీన ప్లే అండ్ పార్టిసిపేట్ – స్పోర్ట్స్ డే, 22వ తేదీన సర్వ్ అండ్ సపోర్ట్ – యూత్ ఫర్ క్లీన్ తెలంగాణ, 23వ తేదీన ఉద్యోగ సాధన – కనెక్టింగ్ టాలెంట్ విత్ ఆపర్చునిటీస్ వంటి కార్యక్రమాలను అధికారుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలలో వివిధ జిల్లా శాఖల అధికారులు, క్రీడాకారులు, యువత, విద్యార్థులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యకర జీవనశైలి, యువతకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడం, మాదకద్రవ్యాల నియంత్రణ, నైపుణ్యాభివృద్ధి, ప్లాస్టిక్ రహిత సమాజం తదితర అంశాలపై చర్చలు, చిత్రలేఖన పోటీలు, సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికల అందజేత, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక కార్యక్రమాలు, స్పోర్ట్స్ డే వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని విభాగాలలో విజయవంతం చేసేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం చిత్రలేఖనం, క్రీడ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు వంటి అంశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, యువతి యువకులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం నిల్వ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 23:**

కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం తరలింపు, నిల్వ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామును బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ మండల తహశీల్దార్ కృష్ణ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం దెబ్బతినకుండా కేటాయించిన ప్రకారం గోదాములు, రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో గోదాములకు వచ్చే ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకొని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలో గల సింగరేణి క్లబ్, బూదకలాన్ గ్రామంలో గల సింగరేణి క్లబ్ లను సందర్శించి ధాన్యం నిల్వకు గల అవకాశాలను పరిశీలించారు. సింగరేణి క్లబ్ లలో ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన అనుమతులు పొందాలని అధికారులకు సూచించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో గల కమ్యూనిటీ హాల్ ను కాసిపేట మండల తహశీల్దార్ సునీల్ దేశ్ పాండే తో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల సమత రైస్ మిల్లును మండల తహశీల్దార్ సదానందం తో కలిసి పరిశీలించి ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి తరలించిన ధాన్యం దిగుమతి వేగంగా చేసుకోవాలని, అవసరమైన మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని తెలిపారు. రైస్ మిల్లులకు నిర్దేశించిన సిఎంఆర్ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువత లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలి.

**దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం.**

**అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్.**

**యూత్ వీక్ సెలబ్రేషన్స్ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రధానం.**

**జోగులాంబ గద్వాల జిల్లా అక్షర కలం ప్రతినిధి**

యువత తమ లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలని, దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్ అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న యూత్ వీక్ సెలబ్రేషన్స్ లో చివరి రోజు శనివారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏ దేశానికైనా యువతే గొప్ప సంపదని, దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. స్వామి వివేకానంద ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం కలిగిన యువత దేశానికి అవసరమని పేర్కొన్నట్లు తెలిపారు. కొంతమంది యువత ఇటీవల డ్రగ్స్ వంటి వ్యసనాలకు



బానిసలై తమ జీవితాన్ని అంధకారం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ రంగంలో రాణించాలన్న పట్టుదల అవసరమని, అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ఈ యూత్ వీక్ సెలబ్రేషన్స్ ద్వారా యువత స్ఫూర్తి పొంది తమ భవిష్యత్తును గొప్పగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా టూరిజం శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన గోడ పత్రికలను విడుదల చేశారు. అనంతరం యూత్ వీక్ లో భాగంగా నిర్వహించిన వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులను అందజేశారు. అలాగే ఫోటోగ్రఫీ పోటీల్లో విజేతలుగా నిలిచిన అయ్యప్ప, రాఘవేంద్ర, విక్రమ్ లకు వరుసగా రూ. 5000, రూ. 3000, రూ. 2000 నగదు బహుమతులను, ప్రశంశాపత్రాలను అందజేశారు. ఇటీవల వివిధ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను, స్పోర్ట్స్ పాఠశాలకు ఎంపికైన చిన్నారులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డివైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, డిపిఆర్ఓ ఆరిఫుద్దిన్, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉపేంద్రనాథ్ గురుస్వామి జయంతి వేడుకలు

**మందమర్రి, మే 23 అక్షర కలం:**



పట్టణంలోని హరిహర దేవస్థాన ప్రాంగణంలో శనివారం ఆలయ వ్యవస్థాపకులు ఉపేంద్రనాథ్ గురుస్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేంద్రనాథ్ గురుస్వామి విగ్రహానికి పూలమాలవేసి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఉపేంద్రనాథ్ గురుస్వామి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ గురుస్వామి సదానందం, ఆలయ కమిటీ అధ్యక్షుడు తౌటం శ్రీనివాస్, అయ్యప్ప స్వామి దీక్షపరులు మద్ది శంకర్, సుకుమార్, నీలి తిరుపతి, ఆర్కే గౌడ్, ఆలయ పూజారి, సిబ్బంది పాల్గొన్నారు.

# సబ్బండ వర్గాలకు అండగా టిఆర్ఎస్ జెండా

**- జూన్ 20 వరకు ఘనంగా తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ జెండా పండుగ**

**త్వరలో జోగులాంబ గద్వాల జిలాల్లో అన్ని మండలాల్లో జెండా ఆవిష్కరణ పండుగ**

**– ముఖ్య అతిథిగా హాజరు కానున్న టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర పరిశీలకుడు వి.ఆర్.ప్రసాద్**

**తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గొంగళ్ళ రంజిత్ కుమార్**

**జోగులాంబ గద్వాల జిల్లా అక్షర కలం ప్రతినిధి**




సబ్బండ వర్గాల ప్రజలకు మరియు సర్వోదయ తెలంగాణ కోసం తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటూ కృషి చేస్తుందని గద్వాల జిల్లా కేంద్రంలోని నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గొంగళ్ళ రంజిత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతెలంగాణ రక్షణ సేన రాష్ట్ర వ్యవస్థాపకురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత గారి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 119 నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాలలో తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ జెండా పండుగను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ జెండాలోని మూడు రంగులు నిర్దిష్టమైన అర్థాలను మరియు ప్రాతినిధ్యాన్ని కలిగి ఉన్నాయని పసుపు రంగు శుభసూచకానికి సర్వోదయనికి మరియు,నీలి రంగు సామాజిక న్యాయాన్ని, దళిత, బహుజన పేద వర్గాల అభ్యున్నతిని మరియు సమసమాజ స్థాపనను ప్రతిబింబిస్తుందని,ఆకు పచ్చ రంగు రాష్ట్రంలో పచ్చదనం, సస్యశ్యామలమైన వ్యవసాయ భూములు మరియు రైతులకు అండగా సుసంపన్నమైన తెలంగాణ అభివృద్ధిని సూచిస్తుందని వారు పేర్కొన్నారు. జూన్ 20 వరకు నిర్వహించే టిఆర్ఎస్ పార్టీ జెండా పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర పరిశీలకులు వి.ఆర్. ప్రసాద్ గారు ముఖ్యఅతిథిగా హాజరై జోగులాంబ గద్వాల జిల్లా మరియు నియోజకవర్గాలతో పాటు అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించే తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా పండుగ కార్యక్రమానికి సంబంధించి తేదీలను ఖరారు చేసి టిఆర్ఎస్ పార్టీ జెండా పండుగ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఈ సందర్భంగా వారు తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్ర ప్రజల పక్షాన ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీ పేద వర్గాల కోసం, యువత, మహిళలు,రైతుల కోసం అండగా నిలిచే తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ పార్టీని జోగులాంబ గద్వాల జిల్లా ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా నాయకులు రంగస్వామి, వెంకట్రాములు, ధరూర్, మల్దకల్,గట్టు,మండలాల అధ్యక్షులు నెట్టెంపాడు గోవిందు, బలరాం నాయుడు, బి. విష్ణు, మండల ఉపాధ్యక్షులు అడవి ఆంజనేయులు,ప్రేమ్ రాజ్, మండల నాయకులు మీసాల కిష్టన్న, గోపాల్,వెం కటేష్,ఎం.రాము, భీమన్న గౌడ్, నరసింహులు, అంజి,రేణప్ప,ఉరుకుందు,భూపతి నాయుడు, లక్ష్మన్న, దొడ్డెన్న,శాంతన్న,తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం పట్టివేత




**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 23:**

జిల్లాలోని జైపూర్ మండలం గోపాల్ పూర్ గ్రామంలో శుక్రవారం ఏ విధమైన లైసెన్స్ లేకుండా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న ఇంటిని సోదా చేసి, అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని మంచిర్యాల ఎక్సైజ్ సిఐ గురువయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశ్వసనీయ సమాచారం మేరకు గోపాల్ పూర్ గ్రామంలో తాళ్లపల్లి రమేష్ గౌడ్ ఇంటిని సోదా చేసి ఆ వ్యక్తి వద్ద నుండి 46 (180ఎంఎల్) మద్యం బాటిల్లు, 12 (650ఎంఎల్) బీర్ బాటిల్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని, పట్టుబడిన మద్యం విలువ సుమారుగా 12 వేల రూపాయల వరకు ఉంటుందని తెలిపారు. అనంతరం రమేష్ గౌడ్ పై ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి, అనంతరం అతనిని జైపూర్ మండల తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేయడం జరిగిందన్నారు.

# విఓఏల దీక్షలకు ధర్మ సమాజ్ పార్టీ మద్దతు

**మందమర్రి, మే 23 అక్షర కలం:**

రాష్ట్ర వ్యాప్తంగా విఓఏ లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత నెల రోజులుగా చేస్తున్న నిరాహార దీక్షలకు ధర్మ సమాజ్ పార్టీ తన సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకుడు నందిపాటి రాజు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న విఓఏ ల దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి, వారి పోరాటానికి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా నందిపాటి రాజు మాట్లాడుతూ , రాష్ట్రవ్యాప్తంగా విఓఏ లు గత నెలరోజుల నుండి సమ్మె చేస్తున్న వారి సమస్యలను పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం



కాలయాపన చేయడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. విఓఏ లకు కనీస వేతనం 20 వేల రూపాయలు చెల్లించాలని, వారిని ఎస్ఈఆర్పి ఉద్యోగులుగా గుర్తించి, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన విఓఏ లకు సిసి పదోన్నతి కల్పించాలన్నారు. విఓఏ లకు సాధారణ, ఆరోగ్య భీమా సౌకర్యం 20 లక్షల రూపాయల వరకు కల్పించాలని, ట్యాప్ సౌకర్యం కల్పించాలని, అదేవిధంగా జిఓ నెంబర్ 58 ని సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని విఓఏ లు పాల్గొన్నారు.

# బాలశక్తి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం.

**జోగులాంబ గద్వాల జిల్లా అక్షర కలం ప్రతినిధి**

మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా అందజేసే ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలశక్తి అవార్డులకు అర్హులైన 5 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల లోపు బాల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిడబ్ల్యూఓ సునంద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధైర్య సాహసాలు, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలు, సంస్కృతి, విజ్ఞాన శాస్త్రం, మరియు సాంకేతికత రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన చిన్నారులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన బాలబాలికలు ఆన్లైన్ ద్వారా తేదీ : 31.8.2026 లోగా ట్ర్రిజూం://ఖుఘుతీసం.స్త్రశీజ.ఱఅ వెబ్సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

# పర్యాటక రంగ అభివృద్ధికి యువత భాగస్వామ్యం కీలకం... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

పర్యాటక రంగ అభివృద్ధికి యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.ప్రజా పాలన –– ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాల సందర్భంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టూరిజం కిట్ ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి పాల్గొన్ని టూరిజం కిట్ను విడుదల చేసి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో సహజసిద్ధమైన పర్యాటక ప్రాంతాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి పర్యాటక వారోత్సవాలు దోహద పడతాయని అన్నారు. యువతలో పర్యాటక రంగంపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని, పర్యాటక రంగం ద్వారా ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయని పేర్కొన్నారు.జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో అవగాహన పెంపుతో పాటు పర్యాటక రంగ అభివృద్ధే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ టి. సునీల్ రెడ్డి, తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏఈ నరేష్ నాయక్, ఖమ్మం టూరిజం సిబ్బంది జె. చంద్రశేఖర్ ఆజాద్, యువత, తదితరులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# వ్యవసాయం ఈజీ..ధాన్యం అమ్మడం కష్టం

తెలుగు రాష్ట్రాల్లో ధాన్యం కొనుగోళ్లు,తరలింపు ప్రహసనంగా మారింది. కల్లాల్లో రైతుల దీనస్థితి టీవీల్లో కనిపిస్తున్నా, పత్రికల్లో వార్తలుగా వస్తున్నా..ప్రభుత్వాల్లో చలనం కానరావడం లేదు. పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్న పాలకులకు సామన్య రైతుల వేదన కనిపించడం లేదు. ఎవరు పాలనలో ఉన్నా ఇదే దుస్థితి ఉంది. తమ హయాంలో గొప్పగా చేశామని చెప్పుకుంటున్న బిఆర్ఎస్ హాయంలోనూ ఇవే దృశ్యాలు కనిపించాయి. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడం ప్రభుత్వాల బాధ్యత. లేదా ఏ పంటను కొంటారో చెప్పి అవే పంటలను పండించేలా ప్రణాళికలు సిద్దం చేయాలి. కానీ అలా జరగడం లేదు. కెసిఆర్ హయాంలో వరేస్తే ఉరే అంటూ చెప్పిన మాటలను అప్పడే మర్చిపోతే ఎలా. దీనికి కెటిఆర్ సమాధానం చెప్పాలి. కానీ ప్రభుత్వంపై నిందలు మోపడం తప్ప గ్రామాలకు వెళ్లి, ప్రభుత్వాన్ని ఒప్పించి కొనుగోళ్లు చేయించే పాత్రను ప్రతిపక్షం తీసుకోవడం లేదు. ఇకపోతే ఇప్పడేమో మంత్రులు చెప్పేదొకటి గ్రామాల్లో కనిపిస్తున్నదొకటి. వర్షాకాలం దగ్గర పడడంతో పాటు, అకాల వర్షాలతోనూ రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల కల్లాల్లో ధన్యం తడిసి కొట్టుకుపోయింది. రోజులతరబడి కొనుగోలు కేంద్రాల్లో రాత్రనక పగలనకా గోస పడుతున్నా.. అధికారులు కనికరిస్తలేరని అన్నదాతలు ఆవేదన చెందుతున్న తీరును ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఈ దేశంలో రైతులంటే అందిరికీ చులకనగా మారింది. ధాన్యం సేకరణపై ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్షించారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు.

ధాన్యం కాంటా వేయడం లేదు. వేసిన ధాన్యం లారీలకు ఎక్కడం లేదు. లారీలకు ఎక్కేవరకు రైతులే కాపలాగా ఉండాల్సి వస్తోంది. ఆరుగాలం కష్టించి పండించిన పంటను అష్టకష్టాలు పడి కొనుగోలు కేంద్రాలకు తెస్తే రోజుల తరబడి వేచి చూసేలా చేయడం పాలకుల వైఫల్యం తప్ప మరోటి కాదు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పక్కా ప్రణాళిక లేకపోవడమే ఈ దుస్తితికి కారణం. ఇకపోతే తెచ్చిన ధాన్యం అకాల వర్షాలకు ఎక్కడ తడుస్తుందోనని ఆందోళన చెందుతున్నరు. మరోవైపు తాలు, తడిసిందన్న కారణాలతో రకరకాల కొర్రీలు పెడుతూ నిలువు దోపిడీ చేస్తున్న తీరు ఏ గ్రామం వెళ్ళినా కనిపిస్తుంది. కొనుగోలు కేంద్రంలో యంత్రాల కోసం గొడవలు, సీరియల్ నంబర్, వంతుల పేరిట నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక పండిన ధాన్యం రోడ్డుపైన ఆరబెట్టేందుకు ఉదయం రోడ్డుపై నేర్పుకోవాలి, సాయంత్రం టార్పాలిన్ కప్పి కాపలాకాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలకు తడుస్తున్న వడ్లు మొలకెత్తుతుంది. కొనేటప్పుడు ఏం పరిస్థితి ఉంటుందోననే భయం పట్టుకున్నది. తడిసిన వడ్లను కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాల్సిన బాధ్య ఉంది. ఇలాంటి కష్టాల వల్ల సన్నకారు రైతుల నడ్డి విరుగుతోంది. ఎప్పుడు కొనుగోలు చేస్తారోనన్న ఎదురుచూపులకే రోజులు గడిచిపోతున్నాయి. ఎప్పుడు వానొస్తదో తెలియక భయంతో బతుకుతున్నారు. ముఖ్యంగా లారీలు రావడం లేదని ధాన్యం తరలించడం లేదు. చాలాచోట్ల కడుపు మండిన రైతులు రోడ్డెక్కుతున్నరు. తెచ్చిన ధాన్యం కాంటా వేసి, లారీల్లో తరలించే ఏర్పాట్లు చేస్తే ఈ దుస్థితి రాదు. తక్షణం ప్రభుత్వం స్పందించి ఒకటి,రెండు రోజుల్లో అన్‌లోడ్ చేయించేలా చర్యలు తీసుకోవాలి. లారీలు, హమాలీల కొరత కారణంగా రవాణాలో జాప్యం జరుగుతున్నది. ప్రజాప్రతినిధులు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు. ధాన్యం అమ్ముకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులను పాలకపక్ష నేతలు పరామర్శించడం లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. వర్షం పడితే ధాన్యం తడిసిపోతుంది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయకపోవడంతో ఎండలో ఆరబోస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తూకం వేసిన గన్నీ బస్తాలు ఉండటం లేదు. లారీలు సకాలంలో రావడం లేదు. దీంతో ధాన్యం మిల్లులకు తరలించే వరకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. లారీల సమస్య తీవ్రంగా ఉన్నదని, అదనంగా డబ్బులు ఇవ్వాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెప్తున్నారు. ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లలో అడుగడుగునా రవాణా కష్టాలు నిత్యం ఎదురవుతున్నాయి. హమాలీలు అందుబాటులో లేకపోవడంతో పాటుగా లారీల కొరత వేధిస్తుండటంతో కల్లాల్లో ధాన్యం నిలిచి పోతుంది. రోజుల తరబడి వేచి చూస్తే కానీ ధాన్యం అమ్ముకునే పరిస్థితి లేకుండా పోయింది. దొడ్డు ధాన్యాన్ని దించుకునేందుకు రైస్ మిల్లర్లు తీవ్రంగా సతాయిస్తున్నారు.



నాలుగైదు కిలోలు తరుగు పేరిట దోచేస్తున్నారు. లేదంటే లారీల్లోని ధాన్యం సంచులు దించుకునేందుకు ససేమిరా అంటున్నారు. లారీల యజమానులు సైతం సంచికి రూ.4వరకు వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైస్ మిల్లర్లకు తోడుగా పీఏసీఎస్ సెంటర్లలో సహకార సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రైతులను నిలువునా ముంచేస్తున్నారు. ధాన్యం తరలించడంలో జాప్యం జరుగుతుండటం తో రైతులు రోడ్డు ఎక్కి ఆందోళనలు చేయాల్సి వస్తోంది. ఎక్కడ చూసినా గన్నీ సంచులు లేవని, లారీలు వస్తలేవని మక్కలు కాంటా వేస్తలేరని రైతులు వాపోతున్నారు. కాంటా పెట్టాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. గన్నీ సంచులు లేవు మీరే కొనుక్కోవాలని అంటున్నారు. రైతులకు ఇది జీవన్మరణ సమస్యగా మారింది. ప్రభుత్వం వెంటనే దీనిపై దృష్టి సారించాలి. కలెక్టర్లు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదని పరిస్థితులు చెబుతున్నాయి. ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారన్నది పాలకుల చిత్తశుద్ధిపై ఆధారపడి ఉంది.

# పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

## --హెచ్ సి.యు విద్యార్థి సంఘం నాయకులు రాకేష్ దత్త ఆద్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**



పెండింగ్లో ఉన్న విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని,కలెక్టరేట్ లోని ధర్నా చౌక్ లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు రాకేష్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెండింగ్ లో ఉన్న 10వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలు విడుదల చేయాలని, విద్యార్థులపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి సరికాదు అని అన్నారు.రాకేష్ దత్తా నిరాహార దీక్షకు ముఖ్య అతిధిగా పాల్గొన్నా జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ డా.ర్యాగా అరుణ్ కార్యక్రమంలో మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడటం విడనాడాలి అని, విద్యార్థుల ఆగ్రహానికి, ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ప్రముఖ వైద్యులు గోంగూర వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఓ నెంబర్ 7 రద్దు చేయాలని విజ్ఞప్తిచేసారు. ఫీజు బకాయిలని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరాహాదీక్ష కొనగిస్తున్నట్లు తెలిపారు. ఈ దీక్షకు సంఘీభావం తెలిపిన వారిలో మోత్కూరు నారాయణ రావు, బక్క జడ్సన్, వేముల రామకృష్ణ తదితరులు సంఘీభావం తెలిపారు ఈ కార్యక్రమంలో బీసీ టౌన్ ప్రెసిడెంట్ గోనె శ్రీ శ్రీ, ఎం.డి.ఠాగూర్, జయంత్ యాదవ్, హరి యాదవ్ చింతల రోహిత్ , భాషబోయిన ఉపేందర్ విద్యార్థులు పాల్గొన్నారు...

# పర్యటన చేసే గ్రామాలు పూర్తి పల్లె వాతావరణం కలిగేలా చూడాలి.

## రాష్ట్ర పర్యాటక కార్యదర్శి వాణి ప్రసాద్, ఐఏఎస్,

**అక్షర కలం / భద్రాచలం**



పర్యాటకశాఖ తరఫున గిరిజన గ్రామాలలో పర్యాటకులు ఎక్కువ శాతం పర్యటన చేసే గ్రామాలు పూర్తిస్థాయి పల్లె వాతావరణం కనువిందు కలిగేలా ఉండే గిరిజన గ్రామాలు మరియు రాత్రి బస చేసే విధంగా ఉండే గ్రామాలు గుర్తించి పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు భారత ప్రభుత్వంపర్యాటకమంత్రిత్వ శాఖ కార్యాలయానికి పంపించాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక ప్రత్యేక కార్యదర్శి వాణి ప్రసాద్ ఐఏఎస్ సంబంధితఅధికారులకుఆదేశించారు. శనివారంనాడుహైదరాబాదులోని పర్యాటకశాఖకార్యాలయంకాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఐటిడిఏ పిఓ లతో ధర్తీ జుగా కింద గిరిజన ప్రాంతాలలో హోమ్ స్టేల అభివృద్ధి క్రింద ప్రాజెక్టు అమలు మరియు పర్యవేక్షణ కోసం వీడియో కాన్ఫరెన్స్ ద్వారాసమీక్షించారు. ఈవీడియో కాన్ఫరెన్స్ లో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్ బి ఎం, అడిషనల్ సెక్రటరీ సర్వేశ్వర్ రెడ్డి, ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారిబి.రాహుల్, పాల్గొన్నారు.ఈ సందర్భంగా పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి వాణి ప్రసాద్ మాట్లాడుతూ వివిధ జిల్లాలలోని గిరిజన గ్రామాలలో పర్యాటకులు సందర్శించే గ్రామాలు పూర్తిస్థాయిలో పల్లె వాతావరణం ఉట్టిపడేలాఉండేగ్రామాలుపర్యాటకులకుఅనుకూలంగాఉండేలా గ్రామాలు గుర్తించిపర్యాటకులుబసచేయడానికి అనుకూలంగా ఉండాలని,ఆ గ్రామాలలో తప్పనిసరిగా వాటర్ ఫాల్స్, దేవాలయాలు మరియు గిరిజన కల్చర్,హార్టికల్చర్ అలాగే గిరిజనులు తయారు చేసే వివిధ రకాల ఆర్ట్ మరియు క్రాఫ్ట్ కి సంబంధించినచిన్నతరహాపరిశ్రమలు లాంటివిఉండేలాచూడాలనిఅన్నారు.పర్యాటకులుగ్రామాన్నిసందర్శించగానే జీవం ఉట్టిపడేలా గ్రామంలోని ప్రజల మర్యాద మన్ననాలతో పాటు గ్రామం శానిటేషన్ పరంగా పరిశుభ్రంగా ఉండాలని అలాగే నిరుద్యోగులైన గిరిజన యువతకు టూరిస్టులకు పర్యాటక స్థలాలకు సంబంధించిన వివరాలు తెలిసే విధంగావారికిఅవగాహనకల్పించాలని అన్నారు.దానికి సంబంధించిన ప్రతిపాదనలు ఈనెల ఇరవై ఎనిమిది వరకు పర్యాటకశాఖకుపంపించాలని అధికారులకు ఆదేశించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఉందని,భక్తులతోపాటుపర్యాటకులు ప్రతిరోజుఅధికంగాదేవస్థానందర్శనం నకు వస్తూ ఉంటారని,అలాగేగిరిజన గ్రామాలలోపర్యాటకస్థలాలనుగుర్తించడానికిత్వరలోసంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పర్యాటకస్థలాలుమారుమూలప్రాంతాలలోని బెండలపాడు,కిన్నెరసాని, గోగుల పూడి,బొజ్జిగుప్ప గ్రామాల గురించి అధికారులసూచనలద్వారా ప్రతిపాదనలుతయారుచేసిసమర్పిస్తామని ఐటిడిఏ పిఓ బి.రాహుల్ సెక్రెటరీ కితెలిపారు.ఈకార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్,తదితరులుపాల్గొన్నారు.

# మా ఓటు మీకు కావాలి కానీ మా సమస్యలు పట్టవా

## దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కెమ్మసారం అశోక్

**అక్షర కలం సిద్దిపేట మే 23:**




బి ఆర్ స్ కౌన్సిలర్ల పైన దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కెమ్మసారం అశోక్ తీవ్ర ఆగ్రహం సిద్దిపేట టౌన్ ఆసరా పెన్షనర్ల ఆందోళన అసలు పింఛన్ల ఎంక్వాయిరీ ఎక్కడ చెప్పే నాథుడే లేడా ఇన్నాళ్లు ఉన్న రాజకీయ నాయకులు ఏమయ్యారు కేవలం మా ఓట్ల గురించేనా మమ్మల్ని సిద్దిపేట జిల్లాలోని గణేష్ నగర్ కాలనీలో సమీక్ష సమావేశం దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం ఆధ్వర్యంలో దయచేసి సిద్దిపేట్ టౌన్ లో ఉన్న 43 కౌన్సిలర్లు మాజీగా ఉన్నప్పటికీ ప్రస్తుతం ఎన్నికలు ముందున్నాయి మీ పదవీకాలం ముగిసిందని మీరు చేతులు దులిపేసుకోవడం అదికాదు మీకు ఓటు వేసి గెలిపించిన ప్రజలకు కొంచెం న్యాయం చేపించారని దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం తరఫున విజ్ఞప్తి ఎందుకంటే టౌన్ లో ఏ వార్డులో నైనా పింఛన్స్ ఎంక్వాయిరీ కోసం ఎక్కడ నిర్వహిస్తున్నారు తెలియని పరిస్థితి అసలు దివ్యాంగులకు మరియు వృద్దులకు మరియు ఒంటరి మహిళలకు మరియు వితంతువులకు మరియు బిఈడి కార్మికులకు మరియు చేనేత కార్మికులకు వివిధ రకాల పింఛన్దారులకు ఫేస్ క్యాన్ చేయించుకోనికి వారి వార్డు మాజీ కౌన్సిలర్ సహకరించకపోవడంతో ఆ వార్డులలో గతంలో పోటీ చేసిన బిజెపి కాంగ్రెస్ అభ్యర్థులు కూడా వార్డు ప్రజలకు ఇంటిమేషన్ ఇవ్వని దుర్మార్గం దయచేసి సిద్దిపేటలో ఉన్న 43 వార్డులో ఉన్న మాజీ కౌన్సిలర్లను కు తెలియజేయునది ఏమనగా ఐదు సంవత్సరాలు వార్డు ప్రజల సొమ్ము మీరు తిన్నారు కాబట్టి అవార్డు ప్రజలకు మీరు దగ్గరుండి పింఛన్ వచ్చేలాగా బ్రతికున్న వారిని వార్డులో ఎక్కడైతే చేయూత పింఛన్ ఎంక్వేరీ స్కానింగ్ జరుగుతుందో అక్కడికి మీరు దగ్గరుండి ఒక్కొక్కరిని తీసుకువెళ్లి వారికి సాయపడగలరని విజ్ఞప్తి లేనియెడల మీకు సిద్దిపేట టౌన్ లో ఏ పార్టీలోనైనా గాని ఇండిపెండెంట్ గాని అవకాశం వార్డు ప్రజలు ఇవ్వబోరని దివ్యాంగుల పక్షాన హెచ్చరిస్తున్నామన్నారు.

# చెక్ పోస్టుల వద్ద నిఘా కట్టుదిట్టం..

## అక్రమ రవాణా జరగకుండా పూర్తిస్థాయిలో కట్టడి..

## పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**



అక్రమ రవాణా జరగకుండా పూర్తిస్థాయిలో కట్టడి చేయడానికి చెక్ పోస్టుల వద్ద నిఘా కట్టుదిట్టం చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.శనివారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కల్లూరు డివిజన్ పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. సరిహద్దు నుండి ఇసుక అక్రమంగా రవాణా చేసే వాహనాలపై (ట్రాక్టర్లు, టిప్పర్లు) చట్టపరమైన కేసులు నమోదు చేసి సీజ్ చేయాలన్నారు. గంజాయి రవాణాను అడ్డుకోవడానికి స్థానిక పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. అదేవిదంగా రేషన్ బియ్యం అక్రమంగా ఇతర రాష్ట్రాలకు లేదా మిల్లులకు తరలకుండా గోదాములు, వాహనాలపై నిఘా పెంచి, కఠినమైన కేసులు నమోదు చేయాలన్నారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై నాన్-బైలబుల్ కేసులు పీడీ యాక్ట్ అమలు చేయాలన్నారు.పండుగల సమయంలో చట్టవిరుద్ధంగా పశువుల రవాణా, వధింపులు జరగకుండా జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద వాహనాల విస్తృత తనిఖీలు చేయన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడం, సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచడం చాల కీలకమన్నారు.సమావేశంలో ఏసీపీ వసుంధర యాదవ్, ఏసీపీ సాంబరాజు , ఇన్స్పెక్టర్ శ్రీహరి, లు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన జీవితానికి క్రీడలు ఎంతో అవసరం...జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్


**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**

ఆరోగ్యకరమైన జీవితానికి క్రీడలు ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యువజన, క్రీడల అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా "ఉద్యోగ సాధన -- కనెక్టింగ్ టాలెంట్ విత్ ఆపర్చునిటీస్" కార్యక్రమం జాబ్ మేళా క్రింద ఎంపికైన 618 మంది అభ్యర్థులకు జాబ్‌మేళా ప్రొవిజనల్ ఆఫర్ లెటర్లు అందజేశారు. అలాగే సీఎం కప్- 2026 రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన 72 మంది యువ క్రీడాకారులను సన్మానించారు. మొత్తం 433 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గతంలో సాధారణంగా కుటుంబాల్లో క్రీడలకు అంతగా ప్రోత్సాహం ఉండేది కాదని, ప్రస్తుతం సానియా మీర్జా, తిలక్ వర్మ వంటి యువత క్రీడల్లో రాణిస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. ప్రస్తుతం క్రికెట్ మాత్రమే కాకుండా అనేక క్రీడల్లో యువత ప్రతిభ కనబరుస్తోందని, ఇటీవల ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అథ్లెటిక్స్ విభాగంలో కూడా పతకాలు సాధించడం గర్వకారణమని తెలిపారు.ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతోందని, ప్రముఖ ఇన్వెస్టర్ రాకేష్ ఝున్‌ఝున్‌వాలా సుమారు 50 వేల కోట్ల సంపద సంపాదించి నప్పటికీ ఆరోగ్య సమస్యలతో చిన్న వయసులోనే మరణించారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. తాను అన్ని చోట్ల పెట్టుబడులు పెట్టానని, కానీ ఆరోగ్యంపై పెట్టుబడి పెట్టలేదని ఆయన చెప్పిన మాటలను గుర్తు చేశారు. సంపద కంటే ఆరోగ్యం ముఖ్యమని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రీడలు ఎంతో అవసరమని కలెక్టర్ తెలిపారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా క్రీడలు అందిస్తాయని అన్నారు.ఖమ్మం జిల్లా క్రీడల్లో ఎప్పుడూ ముందంజ లో ఉంటుందని, ఇక్కడ మంచి మౌళిక వసతులు ఉన్నాయని, కోచ్‌లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. క్రీడల్లో విజయాలు సాధించాలంటే శరీరాన్ని దేవాలయంలా భావించి సరైన పోషకాహారం తీసుకోవాలని గాయాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టితే దీర్ఘకాలం క్రీడల్లో కొనసాగవచ్చని సూచించారు.ప్రతి ఒక్కరిలోనూ ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, కొందరికి మేధస్సు, కొందరికి సంగీతం, నృత్యం, మరికొందరికి క్రీడల్లో ప్రతిభ ఉంటుందని, వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని యువతకు సూచించారు.ఉద్యోగాలు సాధించిన యువతకు ఇది మొదటి అడుగు మాత్రమేనని, కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి కష్టపడి పనిచేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. చిన్న స్థాయి ఉద్యోగంతో ప్రారంభించి ప్రస్తుతం మంచి స్థాయికి ఎదిగిన యువత ఉదాహరణలు తమకు తెలిసి ఉన్నాయని, కృషి, పట్టుదలతో మంచి భవిష్యత్తు సాధించవచ్చని యువతకు ప్రోత్సాహం ఇచ్చారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జాబ్‌మేళాలో ఎంపికైన యువతకు అభినందనలు తెలిపారు. జాబ్‌మేళాలో 618 మంది ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. సీఎం కప్ రాష్ట్ర స్థాయి పతక విజేతలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ప్రతి విజయం జీవితంలో ఒక మైలురాయిగా నిలవాలని, అది భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. యువత అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ సునీల్ రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి, కోచ్ లు, క్రీడాకారులు, విద్యార్థినీ, విద్యార్థులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట





# గుజరాత్ టైటాన్స్ నుంచి అత్యధికంగా నలుగురు..

బీసీసీఐ మంగళవారం అఫ్గానిస్తాన్‌తో జరగబోయే వన్డే సిరీస్ కోసం 15 మందితో కూడిన టీమిండియాను ప్రకటించింది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని ఈ జట్టు ఎంపికలో ప్రస్తుత ఐపీఎల్ 2026 ప్రదర్శనలు స్పష్టమైన ప్రభావాన్ని చూపించాయి. అయితే ఈ జట్టులో ఐపీఎల్ ఫ్రాంచైజీల వారీగా ఆటగాళ్ల ప్రాతినిధ్యం ఎలా ఉందో చూస్తే పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వన్డే సిరీస్ జట్టులో గుజరాత్ టైటాన్స్ ఫ్రాంచైజీ నుంచి అత్యధికంగా నలుగురు ఆటగాళ్లు చోటు దక్కించుకున్నారు. భారత జట్టును ముందుండి నడిపించబోయే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నాడు. గాయం కారణంగా గత వన్డే సిరీస్‌కు దూరమైన ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ తిరిగి జట్టులోకి వచ్చాడు. ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ కూడా తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అయితే అందరినీ ఆశ్చర్యపరుస్తూ, గుజరాత్ తరపున ఇంకా ఐపీఎల్ అరంగేట్రం కూడా చేయని యువ బౌలర్ గుర్నూర్ బ్రార్‌కు తొలిసారి జాతీయ జట్టు నుంచి పిలుపు రావడం గమనార్హం. ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ నుంచి ముగ్గురు ఆటగాళ్లను సెలెక్టర్లు ఎంపిక చేశారు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, 2026 టీ20 ప్రపంచకప్, ఆపై ఐపీఎల్‌లో పరుగుల వరద పారించిన ఇషాన్ కిషన్ భారీ పునరాగమనం చేశాడు. తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి కూడా వన్డే జట్టులో తన స్థానాన్ని కాపాడుకున్నాడు. ఇక హైదరాబాద్ స్పిన్నర్ హర్ష్ దూబే ఈ ఐపీఎల్‌లో 8 వికెట్లతో రాణించడంతో, అతడికి తొలిసారి భారత జట్టులో అవకాశం కల్పించారు. ముంబై ఇండియన్స్ నుంచి సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా ఎంపికైనప్పటికీ, వీరిద్దరి లభ్యత వారి ఫిట్‌నెస్‌పైనే ఆధారపడి ఉంటుంది. రోహిత్ పిక్క కండరాల గాయంతో, పాండ్యా నడుము నొప్పితో బాధపడుతున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఎంపికయ్యారు. పంజాబ్ కింగ్స్ నుంచి ఎడమచేతి వాటం బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌తో పాటు, ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను ఈ సిరీస్‌కు వైస్ కెప్టెన్‌గా నియమించారు.



# ఒకే బెర్త్.. ఐదు జట్లు పోటీ..

ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసులో మూడు బెర్త్‌లు కన్ఫార్మ్ అయ్యాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇప్పటికే ప్లేస్ ఫిక్స్ చేసుకోగా.. చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించిన తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్‌తోపాటు గుజరాత్ టైటాన్స్ కూడా ప్లే ఆఫ్స్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. మూడు జట్లు తమ స్థానాలను ఖరారు చేసుకోగా.. మిగిలిన ఒక స్థానం కోసం ఐదు జట్ల మధ్య పోటీ నెలకొంది. ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ అధికారికంగా ప్లే ఆఫ్స్ నుంచి తప్పుకోగా.. పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు ఒక స్థానం కోసం పోటీ పడుతున్నాయి. ఈ సీజన్‌లో ఫస్టాఫ్‌లో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్.. సెకండాఫ్‌లో పూర్తిగా తేలిపోయింది. వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో ఓటమితో ప్లే ఆఫ్స్ ఆశలు సంక్లిష్టం చేసుకుంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆఖరి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో పంజాబ్ గెలిస్తే.. 15 పాయింట్లకు చేరుకుంటుంది. అదే సమయంలో రాజస్థాన్ రాయల్స్ తమ రెండు మ్యాచ్‌లలో కచ్చితంగా ఒక మ్యాచ్‌లో ఓడిపోవాలి. కేకేఆర్ కూడా ఒక మ్యాచ్‌లో ఓడిపోవాలి. ఒకవేళ కేకేఆర్ రెండు మ్యాచ్‌లు గెలిచినా.. నెట్ రన్ రేట్‌లో పంజాబ్ కంటే వెనుకబడాలి. లక్నో చేతిలో పంజాబ్ ఓడిపోతే.. 13 పాయింట్ల వద్దే ఆగిపోయి.. కేకేఆర్, రాజస్థాన్, ఢిల్లీ, చెన్నై జట్ల ఓటమి కోసం ప్రార్థించాల్సి ఉంటుంది. రాజస్థాన్ రాయల్స్‌కు ఇంకా రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇవాళ లక్నో సూపర్ జెయింట్స్‌తో.. మరొకటి ఆదివారం ముంబై ఇండియన్స్‌తో ఆడనుంది. రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే.. 16 పాయింట్లతో ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా నేరుగా ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటుంది. ఒకవేళ రాజస్థాన్ ఒక్క మ్యాచ్‌లో గెలిచి.. ఒకటి ఓడిపోతే.. అప్పుడు 14 పాయింట్లతో ఉంటారు. పంజాబ్ కింగ్స్, కేకేఆర్ జట్లతోపాటు చెన్నై, ఢిల్లీ జట్ల ఓటమి కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది. రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోతే.. టోర్నీ నుంచి ఔట్ అవుతుంది.

# ముంబై ఇండియన్స్ నుండి ఇద్దరు కీలక ఆటగాళ్లు అవుట్..!

ఐపీఎల్ చరిత్రలో ఐదుసార్లు విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్ జట్టుకు ఈ ఏడాది అస్సలు కలిసిరావడం లేదు. ఇప్పటికే ప్లేఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించిన ఈ జట్టును గాయాల సమస్యలు నీడలా వెంటాడుతున్నాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, స్టార్ ఓపెనర్ క్వింటన్ డి కాక్, యువ ఆల్‌రౌండర్ రాజ్ అంగద్ బావా మిగిలిన మ్యాచ్‌లకు పూర్తిగా దూరమయ్యారు. ఈ విషయాన్ని ముంబై ఇండియన్స్ యాజమాన్యం అధికారికంగా ధృవీకరించింది. ప్రతిష్టాత్మకమైన పోరాటంలో ఇలాంటి కీలక సమయంలో ఆటగాళ్లు దూరం కావడం జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తోంది. జట్టులో అత్యంత నమ్మకమైన వికెట్ కీపర్ బ్యాటర్ అయిన క్వింటన్ డి కాక్ ఎడమ మణికట్టు తీవ్రమైన గాయానికి గురైంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌కు ముందే అతడు ఈ నొప్పితో బాధపడ్డాడు. వైద్య నిపుణులు పరీక్షించిన తర్వాత అతడికి విశ్రాంతి తప్పనిసరని తేల్చారు. రోహిత్ శర్మ గాయపడిన సమయంలో జట్టులోకి వచ్చి అద్భుతమైన శతకంతో మెరిపించిన డి కాక్, ఇలా అర్ధాంతరంగా టోర్నీ నుంచి తప్పుకోవడం ముంబై బ్యాటింగ్ విభాగానికి పెద్ద మైనస్‌గా మారింది. మరోవైపు యువ ప్రతిభావంతుడు, ఆల్‌రౌండర్ రాజ్ అంగద్ బావా సైతం దురదృష్టవశాత్తూ గాయాల బారిన పడ్డాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో అతడి కుడిచేతి బొటనవేలికి తీవ్రమైన గాయమైంది. పరీక్షల్లో అతడికి లిగమెంట్ తెగినట్లు నిర్ధారణ అయింది. దీనివల్ల అతడు ఈ సీజన్‌లో ముంబై తరపున తదుపరి మ్యాచ్‌లు ఆడే అవకాశం కోల్పోయాడు.

# అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సినిమా
CINEMA



# చిరుకు కూతురుగా అనస్వర

చిత్రపరిశ్రమలో ఎప్పుడు ఎవరిని అదృష్టం వరిస్తుందో చెప్పడం చాలా కష్టం. కొంతమందికివరుస విజయాలు అందుకున్నా కొన్నిసార్లు ఛాన్స్ లు రావు. మరికొంతమందికి ఒక్క సినిమా చేసినా మెగా ఛాన్స్ వచ్చేస్తోంది. తాజాగా మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ రెండో కేటగిరిలో ఉందని చెప్పొచ్చు. చిన్న చిన్న పాత్రలు చేస్తూ కెరీర్ ను ప్రారంభించిన ఈ బ్యూటీ ప్రస్తుతం స్టార్ హీరోయిన్ గా కొనసాగుతోంది. ఛాంపియన్ సినిమాతో అనస్వర తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది. రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి మిక్స్డ్ టాక్ ను అందుకుంది. సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినా అనస్వర న్యాచురల్ యాక్టింగ్ కి తెలుగు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అమ్మడికి టాలీవుడ్ లో మంచి భవిష్యత్ ఉంటుందని జోస్యం కూడా చెప్పారు. ఇప్పుడు ఆ జోస్యం నిజమైంది. ఈ చిన్నది తన రెండో సినిమానే మెగాస్టార్ చిరంజీవితో చేస్తోంది. మెగాస్టార్ చిరంజీవి– బాబీ కొల్లి కాంబోలో వస్తోన్న చిత్రం మెగా 158. కెవిఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రం తాజాగా పూజా కార్యక్రమాలను పూర్తిచేసుకుంది. ఈ ప్రారంభోత్సవంలో పవన్ కళ్యాణ్ ముఖ్యఅతిథిగా పాల్గొనడం విశేషం. చిరంజీవిపై చిత్రీకరించిన ప్రారంభ సన్నివేశానికి పవన్ కళ్యాణ్ క్లాప్ కొట్టారు. ఇక ఈ చిత్రంలో అనస్వర ఒక కీలక పాత్రలో నటించబోతోంది. చిరుకు కూతురిగా ఆమె నటిస్తోందని తెలుస్తోంది. మెగాస్టార్ సినిమాలో ఒక చిన్న పాత్ర చేసినా అది ఈ తరం నటీనటులకు అచీవ్ మెంట్ అని చెప్పొచ్చు. ఎన్నోఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న హీరోయిన్లకు రాని మెగా ఛాన్స్ రెండో సినిమాకే ఈ మలయాళ బ్యూటీకి దక్కడం నిజంగా ఆమె అదృష్టమని నెటిజన్స్ అంటున్నారు. ఏది ఏమైనా అనస్వర నక్కతోక తొక్కింది అని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.




# డ్రాగన్‌కు 64 మిలియన్ల వ్యూస్

పొరపాటున కూడా నా కలలోకి రావొద్దు' అంటూ రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్. ఆయన ప్రధాన పాత్రలో ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న చిత్రం 'డ్రాగన్' తారక్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి మొదటి అప్‌డేట్‌గా గ్లింప్స్‌ను విడుదల చేశారు. 4 నిమిషాలు ఉన్న ఈ వీడియో సోషల్ మీడియాను షేక్ చేసింది. ఇప్పుడు రికార్డును కూడా నమోదు చేసింది. 24 గంటల్లో 'డ్రాగన్' గ్లింప్స్ 64 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సొంతం చేసుకున్నట్లు టీమ్ తెలిపింది. ఇప్పటివరకూ ఇండియాలో ఏ సినిమా గ్లింప్స్‌నకు ఇన్ని వ్యూస్ రాలేదని వెల్లడించింది. ఇది ఆల్‌టైం రికార్డు అంటూ పోస్టర్ విడుదల చేసింది. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని భవిష్యత్తులో మరిన్ని రికార్డులు రావడం ఖాయమంటూ ఫ్యాన్స్ భావిస్తున్నారు. తాజాగా విడుదల చేసిన గ్లింప్స్‌లో ఎన్టీఆర్ 'డ్రాగన్'గా రక్తపాతం సృష్టించే శక్తిమంతమైన పాత్రలో కనిపించారు. విజువల్స్ ప్రత్యేకమైన కథా ప్రపంచాన్ని ఆవిష్కరించాయి. 'కె.జి.ఎఫ్' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని అలరించిన దర్శకుడు ప్రశాంత్‌నీల్ 'సలార్' తర్వాత తెరకెక్కిస్తున్న సినిమా ఇది. ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 11న ప్రేక్షకుల ముందుకురానుంది.

# ఉప్పెనను మించిన ట్విస్ట్ ఉంటుంది

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా బుచ్చిబాబు, రామ్ చరణ్ కార్ డ్రైవ్ చేస్తూ ఇంటర్వ్యూ నిర్వహించారు. 'మీకు ఇష్టమైన ఎపిసోడ్ ఏది?' అని దర్శకుడు అడగ్గా.. 'ఢిల్లీ ఎపిసోడ్ చాలా బాగుంటుంది. సినిమాలో నాకు ఇష్టమైన పార్ట్ అది. 'పెద్ది' మొత్తంలో ఎక్కువ మలుపులు ఉండేది ఆ ఎపిసోడ్‌లోనే కదా.. ఉప్పెనలో ట్విస్ట్ కంటే 100రెట్లు ఎక్కువ ఉంటుంది ఆ ఎపిసోడ్ అని చెప్పారు



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ఘనంగా మంత్రి కోమటిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

## పార్టీ శ్రేణుల సమక్షంలో క్యాంపు కార్యాలయంలో కేక్ కటింగ్

### పాల్గొన్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

### జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు పండ్లు,బ్రెడ్ పంపిణీ

అక్షరకలం నల్గొండ

రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గల మంత్రి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోఎమ్మెల్సీ కేతావత్ శంకర్,నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్ పాల్గొని పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేదల పెన్నిధి అని కొనియాడారు. నిరంతరం పేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడతారని అన్నారు.జిల్లా అభివృద్ధి కోసం, అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నాడని పేర్కొన్నారు.మంత్రి



కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పుట్టినరోజు సందర్భంగా పలువురు కార్పొరేటర్లు, కోమటిరెడ్డి వెంకట్రెడ్డి అభిమానులు, ఫ్రూట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు బెడ్లు పంపిణీ చేశారు.నల్గొండ నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాలలో మంత్రి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నల్గొండ మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, సర్పంచులు,మాజీ కౌన్సిలర్లు,మాజీ జడ్పీటీసీలు,మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి కోమటిరెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షల వెల్లువ

### బోకే అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి



అక్షరకలం నల్గొండ

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం హైదరాబాదులోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో మంత్రి ని కలిసి బొకే అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు. అదేవిధంగా ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు మంత్రిని కలిసి బొకే అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# కోదాడ పట్టణంలో ప్రత్యేక మున్సిపల్ అధికారులు తనిఖీలు

### -- నిబంధనలు ఉల్లంఘించిన షాపులకు జరిమానాలు



అక్షరకలం కోదాడ

పట్టణంలో పరిశుభ్రత, ఆహార భద్రత నిబంధనల అమలుపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు పై చెత్త వేస్తున్న హాట్ చిప్స్ షాపు యాజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకుని రూ.2 వేల జరిమానా విధించారు. షాపు పరిసరాల్లో చెత్తను రోడ్డు పై వేయడం గుర్తించిన అధికారులు వెంటనే స్పందించి పెనాల్టీ విధించారు. అలాగే పట్టణంలోని ఎంఎస్ఆర్ మిల్క్ సెంటర్‌లో నిర్వహించిన తనిఖీల్లో గడువు ముగిసిన బిస్కెట్లు ప్యాకెట్లు గుర్తించారు. వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని షాపు యాజమాన్యానికి రూ.1000 జరిమానా విధించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాల విక్రయం, రోడ్లపై చెత్త వేయడం వంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ అధికారులు సానిటరీ ఇన్స్పెక్టర్ సురేష్, రాజయ్య ,జవాన్ గురుస్వామి సిబ్బంది పాల్గొన్నారు.

# సామిల్ టింబర్ డిపో ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

### ---అసోసియేషన్ అధ్యక్షుడిగా చెన్నమల్లు నరసింహ చారి ఏకగ్రీవ ఎన్నిక

అక్షరకలం కోదాడ

ది కోదాడ సామిల్ అండ్ టింబర్ డిపో ఓనర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా చెన్నమల్లు నరసింహచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం కోదాడలోని శ్రీ వెంకటేశ్వర సామిల్, టింబర్ డిపో నందు సంఘ సీనియర్ నాయకులు గొల్లపల్లి అనిల్ అధ్యక్షతన అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కొల్లూరి వేణు, కోశాధికారిగా గొల్లపల్లి బాలకృష్ణలతో పాటు కార్యవర్గ సభ్యులుగా పమ్మి.ఉపేందర్, కె.శంకర్, లక్ష్మణ్,భరత్ పటేల్, శివ,రంజిత్ లు ఎన్నిక అయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నరసింహచారి మాట్లాడుతూ సామిల్



యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్,సుభాని, జగదీష్, మేళ్ళచెరవు అనిల్, భాను తదితరులు పాల్గొన్నారు.

# హత్య చేసి.. ప్రమాదంగా చిత్రీకరించి.! భర్తను కడతేర్చిన భార్య, ప్రియుడు, అక్క

## చందంపేట పోలీసుల చాకచక్యం.. ముగ్గురు నిందితుల అరెస్ట్

అక్షరకలం దేవరకొండ

రోడ్డు ప్రమాదంగా భావించిన ఓ ఘటన.. పోలీసుల లోతైన దర్యాప్తులో పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన దారుణ హత్యగా తేలింది. భర్తను భార్య తన ప్రియుడు, అక్కతో కలిసి అత్యంత కిరాతకంగా హత్య చేసి, ఆపై ప్రమాదంగా చిత్రీకరించేందుకు డ్రామా ఆడిన ఉదంతాన్ని చందంపేట పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు శనివారం వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. చందంపేట మండలం బిల్డింగ్ తండాకు చెందిన రమావత్ నర్సింహ (51) ఈ నెల 19న తెల్దావరపల్లి రహదారి పక్కన మోటార్ సైకిల్‌తో సహా శవమై కనిపించాడు. ప్రాథమికంగా ఇది రోడ్డు ప్రమాదంగా భావించినప్పటికీ, మృతుడి కుమారుడు రమావత్ రాజు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. మృతుడి రెండవ భార్య రమావత్ జ్యోతి ప్రవర్తనపై అనుమానం రావడంతో డిండి సీఐ బీసన్న, చందంపేట ఎస్ఐ లోకేష్ తమదైన శైలిలో విచారించగా సంచలన నిజాలు వెలుగులోకి వచ్చాయి. జ్యోతి తన ప్రియుడు నేనావత్ రాజు, తన అక్క



రమావత్ లక్ష్మితో కలిసి ముందస్తు పథకం ప్రకారమే నర్సింహను హతమార్చినట్లు అంగీకరించింది. నిందితులు ముగ్గురు కలిసి నర్సింహను ఎస్ఎల్‌బీసీ క్యాంపు నుండి కోరుట్ల శివారుకు తీసుకెళ్లి మద్యం తాగించారు. అనంతరం అతడి ముక్కు, నోరు నొక్కి ఊపిరాడకుండా చేసి చంపేశారు. అనంతరం శవాన్ని తెల్దేవరపల్లి రోడ్డు పక్కన పడేసి, పక్కనే బైక్ ఉంచి ప్రమాదంగా సీన్ క్రియేట్ చేశారు.మృతుడిపై గతంలో దేవరకొండ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మోటార్ వాహనాల బ్యాటరీల దొంగతనం కేసులు ఉండటాన్ని నిందితులు ఆసరాగా చేసుకున్నారు. దొంగతనానికి వెళ్లి వస్తూ ప్రమాదానికి గురయ్యాడని నమ్మించేందుకు.. ఘటనా స్థలంలో ఓ ట్రాక్టర్ బ్యాటరీ, పానర్‌ను కూడా ఉంచి పోలీసులనే బురిడీ కొట్టించాలని చూశారు. కానీ సాంకేతిక ఆధారాలు, నిందితుల కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు వారి గుట్టు రట్టు చేశారు. హత్యకు పాల్పడిన భార్య రమావత్ జ్యోతి (38), ఆమె అక్క రమావత్ లక్ష్మి (40, నాగర్‌కర్నూల్ జిల్లా పద్మారాం తండా), ప్రియుడు నేనావత్ రాజు (40, నాగర్‌కర్నూల్ జిల్లా ఎద్దుమిట్ట తండా)లను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఒక మోటార్ సైకిల్, రెండు మొబైల్ ఫోన్లు, ట్రాక్టర్ బ్యాటరీ, పానర్, హత్యకు ఉపయోగించిన మద్యం సీసా మరియు ఎల్ఐసీ ఇన్సూరెన్స్ బాండ్‌ను స్వాధీనం చేసుకున్నారు.దేవరకొండ డీఎస్పీ పర్యవేక్షణలో కేసును సమర్థవంతంగా ఛేదించిన డిండి సీఐ బీసన్న, చందంపేట ఎస్ఐ లోకేష్, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పీసీలు లచ్చు, నరసింహ, హెచ్‌జీలు యాదయ్య, రాందాస్ బృందాన్ని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# మే 25న 'ఛలో నల్గొండ'ను జయప్రదం చేయండి

### చండూరు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకుల పిలుపు

అక్షరకలం, చండూరు

మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగా లభించిన 9 శాతం రిజర్వేషన్ల ఫలాలను మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకునేలా రూపొందించిన 'గో టు విలేజ్' కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు శనివారం చండూరు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో మునుగోడు నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. నల్లగంటి రమేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి



శ్రీశైలం మాదిగలు మాట్లాడుతూ... ఈనెల 25న నల్గొండలో జరిగే జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోవింద్ నరేష్ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. కావున మునుగోడు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుండి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ 'ఛలో నల్గొండ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చండూరు మండల అధ్యక్షుడు ఆకారపు యేసు మాదిగ, ఇరిగి చరణ్ మాదిగ, కూరపాటి శంకర్ మాదిగ, బుషిపాక నరేష్ మాదిగ, బరిగెల లింగయ్య మాదిగ, సాయిలు మాదిగ, సురేష్, అశోక్, మహేష్, శంకర్, గిరి తదితరులు పాల్గొన్నారు.

# భూగోళాన్ని కాపాడుకుందాం.. జీవవైవిధ్యాన్ని రక్షించుకుందాం: కాసాల వెంకట్‌రెడ్డి

### పెరుగుతున్న జనం.. తరుగుతున్న వనంపై సమాచార హక్కు చైతన్య వేదిక ఆందోళన

అక్షరకలం, చండూరు

మానవుల మితిమీరిన జీవనశైలి కారణంగా పర్యావరణ కాలుష్యం రోజురోజుకూ పెరిగిపోతోందని, దీనివల్ల భూగోళం వేడెక్కి జీవవైవిధ్యం తీవ్రంగా దెబ్బతింటోందని సమాచార హక్కు చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు కాసాల వెంకట్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో కాలుష్యం కోరలు చాస్తుండటం వల్ల ఎన్నో విలువైన వృక్షజాతులు, జంతువులు, పక్షులు మరియు వివిధ రకాల జీవరాసులు శాశ్వతంగా అంతరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "పెరుగుతున్న జనం.. తరుగుతున్న వనం.. ఇది మానవాళికి పెద్ద రణం (యుద్ధం)" అన్నట్లుగా నేటి పరిస్థితులు తయారయ్యాయని అభివర్ణించిన ఆయన, భూమిపై మానవజాతి మనుగడ సాగించాలంటే జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. ప్రకృతిని, జీవవైవిధ్యాన్ని దెబ్బతినకుండా కాపాడుకోవాల్సిన కనీస బాధ్యత ప్రతి ఒక్క భారతీయుడిపై ఉందని, పర్యావరణ పరిరక్షణను మనందరం ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించాలని కాసాల వెంకట్‌రెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# గోదావరి పుష్కరాలకు వేయికోట్లు

### జూనియర్ కాలేజీల్లో మహద్యాహ్న భోజనం

### గంగాధర కాలేజీలో పోస్టుల భర్తీకి ఆమోదం

### కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరు

### తెలంగాణ కేబినేట్కీలక నిర్ణయం

హైదరాబాద్,

వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో.. సంబంధిత పనులకు రూ.వెయ్యి కోట్ల కేటాయిస్తూ తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని నిర్ణయించింది. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# యువత స్వయం సమృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యం.. కలెక్టర్ చంద్రశేఖర్

## సీఎం కప్ విజేతలకు బహుమతులు

## జాబ్ మేళా ఎంపికైన వారికి నియామక పత్రాల అందజేత

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం




యువత స్వయం వారి కాళ్లపై వారు నిలబడేందుకు ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి శిక్షణలకు ప్రాధాన్యత ఇస్తున్నదని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా చేపట్టిన యువజన వారోత్సవంలో యువతకు ప్రభుత్వం విస్తృత అవకాశాలు కల్పించిందని అన్నారు. శనివారం ఉదయాదిత్య భవన్ లో సీఎం కప్ క్రీడలలో విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేసి, జాబ్ మేళాలో ఎంపికైన యువతకు నియమకాపు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలో 25 నుంచి 30 ఏళ్ల మధ్య యువత పెద్ద సంఖ్యలో ఉన్నారని, యువతే దేశానికి గొప్ప వనరు అని అన్నారు. యువత స్వయం సమృద్ధిగా నిలబడేందుకు ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం పెంచే ఉద్దేశంతో"ఫిట్ తెలంగాణ "కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు.నల్గొండలో న్యాక్ సెంటర్,సెట్విన్ సెంటర్ ఇందిరా మహిళా శక్తి కేంద్రాలను ఏర్పాటు చేసి యువతకు కెరీర్ మరియు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. వ్యాపారం ప్రారంభించాలనుకునే యువతకు ఎంఎస్ఎంఈ ద్వారా రూ.1 కోటి నుంచి రూ.5 కోట్ల వరకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు.యువత సమాజ అవసరాలను అర్థం చేసుకుని నిరంతరం నేర్చుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా ఫైనాన్స్ డిసిప్లిన్ అవసరమని, ఎంత పొదుపు చేశాం, ఎంత ఖర్చు చేశాం అనే విషయాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, చాటింగ్ వంటి వాటిపై సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలని సూచించారు. యువత డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా మాదకద్రవ్యాల వినియోగంలో ఉన్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఎం కప్ క్రీడలలో రాష్ట్ర స్థాయిలో తొలి స్థానం సాధించిన హాకీ జట్టును కలెక్టర్ అభినందించారు. అలాగే కిక్ బాక్సింగ్, అథ్లెటిక్స్, వాలీబాల్, ఫుట్‌బాల్ తదితర క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ ,అదనపు ఎస్పీ రమేష్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ,కోచ్ శంభు లింగం వివిధ కోచ్ లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# కోదాడలో డ్వాక్రా మహిళల ఆందోళన

## రూ.4.60 లక్షలు వాడుకున్నారని ఆరోపణ



అక్షరకలం కోదాడ

శ్రీ మణికంఠ సమభావన సంఘం పరిధిలోని శ్రీనిధి గ్రూప్‌లో రుణ నగదు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. గ్రూప్‌కు మంజూరైన రుణంలో రూ.4.60 లక్షలు గల్లంతయ్యాయని ఆరోపిస్తూ సభ్యులు శనివారం కోదాడ పట్టణంలోని ఆజాద్‌నగర్ లీడర్ ఇంటి ముందు నిరసనకు దిగారు. మొదటి లీడర్ ఇంటి ముందు టెంట్ వేసి ధర్నా నిర్వహించడం స్థానికంగా చర్చనీయాంశమైంది.గ్రూప్ సభ్యుల కథనం ప్రకారం.. శ్రీనిధి గ్రూప్‌లో మొత్తం 10 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. సంఘం ద్వారా రుణం మంజూరుకాగా, అందులో మొదటి లీడర్ తమ్మిశెట్టి బుజ్జి రూ.4.60 లక్షలు వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుందని సభ్యులు ఆరోపించారు. రెండవ లీడర్ కూడా ఈ వ్యవహారంలో భాగస్వామిగా ఉన్నారని తెలిపారు. అలాగే డ్వాక్రా లోను 10 లక్షలు రుణానికి సంబంధించిన వాయిదాలు మాత్రం సభ్యులపై పడటంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు మాకు ఇవ్వకుండా మోసం చేశారు.ఇప్పుడు బ్యాంకు వాయిదాల కోసం ఒత్తిడి తెస్తోంది అంటూ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో బాధిత మహిళలు శనివారం ఉదయం నుంచే ఆజాద్‌నగర్‌లోని లీడర్ ఇంటి ముందు టెంట్ వేసి ధర్నా చేపట్టారు. మా డబ్బులు మాకు ఇవ్వాలి.బాధ్యులపై చర్యలు తీసుకోవాలి అంటూ నినాదాలు చేశారు. అధికారుల జోక్యంతో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.స్థానికులు స్పందిస్తూ మహిళా సంఘాల పేరుతో తీసుకునే రుణాలు పారదర్శకంగా వినియోగించకపోతే ఇలాంటి సమస్యలు తలెత్తుతాయని అభిప్రాయపడ్డారు. సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధిత మహిళలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# నల్లగొండ జిల్లా పరిషత్ ఉద్యోగుల బదిలీల కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల

అక్షరకలం నల్గొండ

నల్లగొండ జిల్లా పరిషత్తు ఆధీనంలో పనిచేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగుల బదిలీల కౌన్సిలింగ్ కోసం షెడ్యూల్ విడుదలైంది. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం ఈ కౌన్సిలింగ్ ప్రక్రియను నిర్వహించనున్నారు.?నేటి ఉదయం 10:00 గంటల నుండి జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ఈ బదిలీల కౌన్సిలింగ్ ప్రారంభమవుతుంది. అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్), జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రత్యక్ష ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ పారదర్శకంగా జరగనుంది.బదిలీల కౌన్సిలింగ్ హాజరయ్యే ఉద్యోగులు తమ కేటగిరీకి కేటాయించిన సమయానికి అనుగుణంగా హాజరుకావాల్సి ఉంటుంది.

### కేటాయించిన సమయం...

టైపిస్టులు ఉదయం 10:00 నుండి 10:30 వరకుజూనియర్ అసిస్టెంట్స్ ఉదయం 10:30 నుండి 11:15 వరకు రికార్డు అసిస్టెంట్స్ ఉదయం 11:35 నుండి మధ్యాహ్నం 12:50 వరకు ఆఫీస్ సబార్డినేట్స్ మధ్యాహ్నం 02:30 నుండి సాయంత్రం 03:30 వరకురాత్రి కాపలాదారులు (నైట్ వాచ్‌మెన్) సాయంత్రం 03:35 నుండి 04:00 గంటల వరకు కౌన్సిలింగ్ నిర్వహిస్తారు.

# అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

## డిఆర్డిఏ కార్యాలయం ముందు మహిళల ఆందోళన

అక్షరకలం నల్గొండ

చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి విఓ ఏ మాధవిని వెంటనే విధుల నుంచి తొలగించి



ఆమె చేసిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆ గ్రామ మహిళా సంఘాల సభ్యులు డిఆర్డిఏ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ మా గ్రామంలో వి.ఓ.ఎ.గా పనిచేసిన గనిపల్లి మాధవి అక్రమాలపై గ్రామ కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 18న గ్రామసభ నిర్వహించి ఆమెనువిధులను తొలగించాలని, తక్షణమే ఆమె చేసినటువంటి అక్రమ వసూళ్ళను రికవరీ జరగాలని ఏకగ్రీవంగా తీర్మాణం చేయడం జరిగిందన్నారు. తీర్మానం జరిగిన పై అధికారులు ఆమెకు వత్తాసు పలుకుతున్నారని డిఆర్డిఏ అధికారి ముందు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన డిఆర్డిఏ పిడి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ కమిటీలలో తీర్మానం జరిగితే కచ్చితంగా ఆమెని విధుల నుంచి తొలగిస్తామని, అక్రమాలకు పాల్పడినట్టు రుజువైతే ఆమెపై క్రిమినల్ కేసులు పెట్టి డబ్బులను రికవరీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ మహిళలు మాజీ సర్పంచ్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



# భూముల మార్కెట్ విలువల సవరణ పారదర్శకంగా జరగాలి..కలెక్టర్ చంద్రశేఖర్



## మే 28 నాటికి ప్రక్రియను పూర్తి చేయాలని సీసీఎల్ఏ లోకేష్ కుమార్ ఆదేశం

## ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణ




ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను తెలిపారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండిరాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగవంతం చేయడంపై హైదరాబాద్ నుండి భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డి.ఎస్. లోకేష్ కుమార్, అన్ని జిల్లాల కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు రెవెన్యూ లతో ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు.అనంతరం కలెక్టర్.మాట్లాడుతూప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి ఎక్కడా ప్రజలకు ఇబ్బంది కలగకుండా, అదే సమయంలో ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఈ సవరణలు ఉంటాయని పేర్కొన్నారు. అంతకుముందు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నా మార్కెట్ డిమాండ్, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మే 28 నాటికి మార్కెట్ విలువల సవరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ మార్కెట్ ధరలను నిశితంగా పరిశీలించి, ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా శాస్త్రీయంగా ఈ విలువలను ఖరారు చేయాలని సూచించారు. రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# యాదాద్రిలో సరికొత్త "ఆధ్యాత్మిక శోభ"

## రూ.99.55 కోట్లతో అనుబంధ పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

## 15 ఎకరాల విస్తీర్ణంలో మూడు దశల్లో వేద పాఠశాల నిర్మాణం

## 500 మంది విద్యార్థులకు ఉచిత విద్య, వసతి సౌకర్యాలు

## కంచి స్వామి పర్యవేక్షణలో భూమి పూజ

## హాజరైన శాసన మండలి చైర్మన్, మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి భువనగిరి జిల్లాలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయం మరింతగా ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది. శనివారం యాదాద్రి కొండపై రూ.99.55 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘనంగా శంకుస్థాపన చేశారు.ముందుగా కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి పర్యవేక్షణలో, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అత్యంత వైభవంగా వేద పాఠశాల భూమి పూజ కార్యక్రమం జరిగింది. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మిగిలిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనల శిలాఫలకాలను ఆవిష్కరించారు. అభివృద్ధి పనులు మొత్తం రూ.99.55 కోట్ల నిధులతో చేపట్టనున్నారు.

### పనుల విభజన ఇలా ఉంది..

అభివృద్ధి పని కేటాయించిన బడ్జెట్ (రూపాయలలో) అంతర్జాతీయ స్థాయి వేద పాఠశాల రూ. 43.79 కోట్లు, దీక్షాపరుల సదనం (భక్తుల వసతి గృహం) రూ. 43.12 కోట్లు, స్వామివారి నిత్య కల్యాణ మండపం (కొండపై) రూ. 9.86 కోట్లు, వైకుంఠ ద్వారం – కొండపైకి వెళ్లే మెట్ల మార్గం పైకప్పు (రాష్ట్రవస) రూ. 1.41 కోట్లురథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణం రూ. 1.34 కోట్లు.

### మూడు దశల్లో బృహత్తర 'వేద పాఠశాల....

ఈ ప్రాజెక్టులోనే అత్యంత కీలకమైన వేద పాఠశాలను సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో, 1,40,000 చదరపు అడుగుల భారీ వైశాల్యంలో మూడు దశల్లో నిర్మించనున్నారు. మొదటి దశ.. ఇందులో భాగంగా అత్యాధునిక సదుపాయాలతో కూడిన పాఠశాల భవనాన్ని నిర్మిస్తారు. వసతులు.. దాదాపు 500 మంది వేద విద్యార్థులు ఇక్కడ ఉచితంగా విద్యనభ్యసించే అవకాశం కలుగుతుంది. విద్యార్థుల కోసం ప్రత్యేక వసతి గృహాలు, నివాస భవనాలు, విశాలమైన డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు.అదనపు ఆకర్షణలు.. ఈ ప్రాజెక్టు ప్రాంగణంలోనే పవిత్రమైన యజ్ఞశాల, యాగశాలలను కూడా అద్భుతంగా తీర్చిదిద్దనున్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్‌చార్జ్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. వీరితో పాటు ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, దేవాదాయ శాఖ సెక్రటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ధార్మిక సలహాదారులు, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 137 మంది యువతకు జాబ్ ఆఫర్ లెటర్లు అందజేత

## ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలి : అడిషనల్ కలెక్టర్ పాండు



**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 8న నిర్వహించిన జాబ్ మేళాలో వివిధ ప్రముఖ కంపెనీలకు ఎంపికైన 137 మంది అభ్యర్థులకు కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలు లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు జాబ్ ఆఫర్ లెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. జాబ్ మేళాల ద్వారా ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలను యువతకు చేరువ చేస్తున్నామని తెలిపారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కేవలం ఉద్యోగం పొందడం మాత్రమే కాకుండా విధుల్లో క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తే మరింత మంచి అవకాశాలు వస్తాయని అన్నారు. ఉద్యోగాల్లో చేరిన యువత తమ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడటంతో పాటు సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం తుల్జారాం నాయక్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల పట్టివేత:

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మే,23)**



ఉట్కూరు: పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను లక్ష్మీపల్లి శివారులో పోలీసులు పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టగా, 01) లింగమోల్ల అశోక్, లక్ష్మీపల్లి, ఉట్కూర్ మండలం, 02) ఎం. విష్ణు, జేగిరం గ్రామం, యాద్గిరి జిల్లా, కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. వారి పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఉట్కూర్ ఎస్సై రమేష్ తెలిపారు. ఉట్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేపడితే, అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

# ఎంపీ వద్దిరాజు ప్రకటన

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**



ఎండలు రోజురోజుకు మరింత తీవ్రమవుతున్నందున అప్రమత్తంగా ఉండాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ప్రజలను కోరారు. తెలంగాణ వ్యాప్తంగా ఎండలు మండిపోతుండడంతో వడదెబ్బ తగిలి పలువురు ప్రాణాలు కోల్పోయిన దృష్ట్యా అత్యవసరమయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ఒక ప్రకటనలో ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సూర్యుడి ప్రతాపం రేపటి నుంచి మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం పేర్కొనడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేస్తూ చిన్నపిల్లలు, వృద్ధులు తగు జాగ్రత్తలు పాటిస్తూ మంచినీళ్లు, మజ్జిగ ఎక్కువ తీసుకోవాలని సూచించారు. ప్రయాణీకులు, కార్మికులు, కర్షకులు, చిరు వ్యాపారులు మరింత జాగ్రత్తగా ఉండాలని, వడదెబ్బ తగిలినట్టయితే వెంటనే సమీపాన ఉన్న ఆస్పత్రికి వెళ్లి వైద్య సాయం పొందాలని ఎంపీ వద్దిరాజు సలహానిచ్చారు.

# కామ్రేడ్ మల్లెల.రామన్న ఆశయ సాధనకై పోరాడుదాం.

**అక్షర కలం/పినపాక.**

కామ్రేడ్ మల్లెల. రామన్న ఆశయ సాధనకై పోరాడాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపందా) జిల్లా కార్యదర్శి ముద్దా.బిక్షం, టియుసిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే. యాకూబ్షావలి అన్నారు. శనివారం కామ్రేడ్ రామన్న సంతాప సభ టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఆర్. మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన మణుగూరు లోని గుట్ట మల్లారంలో జరిగింది. ఈ సంతాప సభలో వారు పాల్గొని మల్లెల రామన్న చిత్ర పటానికి పూలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ మల్లెల. రామన్న సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపందా), ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ) కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ కార్మికుల,ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేశాడని అన్నారు. దోపిడీ,పీడనలు లేని సమ సమాజ స్థాపన కోసం కలలు కన్నాడని అన్నారు. మణుగూరు ప్రాంతంలో పార్టీ విస్తరణకు,ట్రేడ్ యూనియన్ విస్తరణకు కృషి చేస్తున్న క్రమంలో ప్రమాదవ శాత్తు మరణించ డం బాధాకరమన్నారు. కామ్రేడ్ రామన్న మృతి మణుగూరు ప్రాంత పార్టీకి, ట్రేడ్ యూనియన్ కి, విప్లవో ద్యమానికి తీరని లోటు అన్నారు. కామ్రేడ్ రామన్న మృతి పట్ల సంతా పం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు. మణుగూరు ప్రాంతంలో పార్టీ ని,ట్రేడ్ యూనియన్ ను బలోపేతం చేసి బలమైన విప్లవోద్యమాన్ని నిర్మించడమే కామ్రేడ్ రామన్నకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. అందుకోసం పార్టీ,ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు అందరూ కృషి చేయాల న్నారు. రామన్న ఆశయ సాధన కోసం పోరాడాలన్నారు.



# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు వివేక్ వెంకటస్వామి మైనంపల్లి హనుమంతరావు చిత్రపటాలకు పాలభిషేకం

**అక్షర కలం సిద్దిపేట మే 23:**

శ్రామకు తగ్గ ఫలితం ఇవ్వాలని చట్టాన్ని చేసిన శ్రమిక బంధువులు, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట స్వామిని మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి కొనియాడారు. శనివారం పాలమాకుల గ్రామం లో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి వివేక్ వెంకట స్వామి, మైనంపల్లి హనుమంత రావు ఫోటో ప్లెక్సీ కి పాలాభిషేకంచేశారు. ఈకార్యక్రమనికి ముఖ్య అతిధులుగా మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ ఏండ్ల తరబడి ఎదురుచూసిన కార్మిక వర్గానికి తెలంగాణ ప్రభుత్వం తియ్యటి వార్త చెప్పింది. దాదాపు 12 సంవత్సరాల తర్వాత కనీస వేతనాలపై సమగ్ర సవరణ చేపట్టి, శ్రామికుల జీవితాల్లో కొత్త ఆశలు నింపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి చొరవతో తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రంలోని 1.11 కోట్లకు పైగా కార్మిక కుటుంబాలకు నేరుగా లాభం చేకూర్చనుంది. పెరిగిన ధరలు, ఆకాశాన్నంటిన జీవన వ్యయంతో కార్మికులు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. జీవన వ్యయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగినా వారికి అందుతున్నది పాత వేతనాలే! ఇన్నాళ్లు ఇదే పరిస్థితి. ముఖ్యంగా అసం ఘటితరంగాల్లో పనిచేసే కార్మికుల జీవితం చేతికి వచ్చినది నోటికి సరిపోని స్థితికి చేరింది. ఇలాంటి సమయంలో ప్రభుత్వం కేవలం ఫైళ్ల పరిమితిలో కాకుండా, మానవీయ కోణంలో సమస్యను చూసి ప్రభుత్వంతో నిర్ణయం తీసుకునేలా మంత్రి వివేక్ కృషి హర్షణీయం. శ్రమకు తగిన గౌరవం రాష్ట్రంలోని 73



షెడ్యూల్డ్ ఉపాధి రంగాలకు కొత్త వేతన నిర్మాణం తీసుకురావడం ద్వారా 'కార్మి కుల శ్రమకు తగిన గౌరవం' అనేభావనకు ప్రభు త్వం కొత్త అర్థం చెప్పింది. అన్స్కిల్డ్ కార్మికులకు దాదాపు 35 శాతం వరకు వేతన పెంపు ఇవ్వడం చిన్న విషయం కాదు. సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ వర్గాలకు కూడా గణనీయమైనపెంపులుప్రకటించడం ద్వారా ప్రతి శ్రామిక కుటుంబా నికి భరోసా కల్పించింది. ఈ నిర్ణయంలో మరో ముఖ్యమైన విషయం సమతుల్యత అని స్పష్టం గా చెప్పవచ్చు. ఒకవైపు కార్మికుల సంక్షేమం మరోవైపు పరిశ్రమల అభివృద్ధి. రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందడుగువేసింది. ట్రేడ్ యూనియన్లు, పరిశ్రమల ప్రతిని ధులు, కోర్టుకేసులు,పొరుగు రాష్ట్రాల వేతనాలు, ద్రవ్యోల్బణ పరిస్థితులు అన్నింటినీ అధ్యయనం చేసిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నది. ప్రజల ప్రభుత్వం అంటే ఏమిటో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరోసారి చాటిచెప్పిందనే అభిప్రాయం కార్మిక వర్గంలో వ్యక్తమవుతోంది. ఎన్నికల హామీలకే పరిమితం కాకుండా, శ్రామికుల జీవన ప్రమా ణాలు మెరుగుపడాలనే సంకల్పం ఈ నిర్ణయంలో స్పష్టంగా కనిపిస్తోంది. కార్మిక ఉద్యమంతో కాకా ప్రత్యేక అనుబంధంమంత్రి వివేక్ వెంకటస్వామికి కార్మిక ఉద్యమం తో ప్రత్యేక అనుబంధం ఉంది. కార్మికులతో వారి కుటుంబానిది పేగుబంధం. ఆయన తండ్రి, దివంగత నేత కాకావెంకటస్వామి జీవితాంతం కార్మికుల హక్కుల కోసం పోరాడిన నాయకుడు సింగరేణి నుంచి సిర్పూర్ వరకు కార్మికుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి ఇప్పటికీ గుర్తుండేలా ఉంది. ఇప్పుడు అదే కుటుంబం నుంచి వచ్చిన వివేక్ వెంకటస్వామి కార్మికశాఖ మంత్రిగా ఉండి, శ్రామికులకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోవడం కార్మిక వర్గంలో కొత్త నమ్మకాన్ని పెంచుతోంది. సంక్షేమం, సామాజిక న్యాయం,అభివృద్ధి ఈ మూడు లక్ష్యాలను ఒకే నిర్ణయంలో ప్రతిబింబింపజేసిన అరుదైన ఉదా హరణగా ఈ వేతన సవరణ నిలిచిపోనుంది. తెలంగాణలో ఇకపై కార్మికుడి చెమటకు విలువ ఉంది అనే భావన మరింత బలపడటం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ఈమండల పార్టీ అధ్యక్షులు తప్పేట శంకర్,పాక్స్ డైరెక్టర్ గంగుల రవి, గ్రామ శాఖ అధ్యక్షులు భాస్వ రాజు రాములు, సందెబోయిన తిరుపతి,పొల్ల రాజు, సుద్దాల మహేందర్,వరదోల్ సంతోష్, భాస్వరాజు స్వామి,ఎండీ యాకుబ్ లు పాల్గొన్నారు.

# మల్కాపూర్ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన మాజీ వైస్ ఎం.పీ.పీ వర్ధంతి

**మరణించి రెండు దశబ్దాలు గడిచినా ఇప్పటికి చెరగని ముద్ర**

**గ్రామంలో ఓటమి ఎరుగని ప్రజానాయకుడు**

**సర్పంచుగా, వైస్ ఎంపిపిగా చిరస్మరణీయ సేవలు**

**తండ్రి ఆశయాల వారసత్వంలో కుమారుడు ప్రవీణ్**

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

సుమారు 18 సంవత్సరాల పాటు మల్కాపూర్ గ్రామ రాజకీయాలను శాసించి, కొండాపూర్ మండలంలో ప్రముఖ కాంగ్రెస్ నాయకునిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దివంగత కొండాపూర్ మాజీ వైస్ ఎంపిపి, మల్కాపూర్ మాజీ సర్పంచ్ జోగన్నగారి నర్సింలు 20వ వర్ధంతి సందర్భంగా మల్కాపూర్ ప్రజలు ఆయన సేవలను స్మరించుకుంటున్నారు. 2006 మే 24న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆయన గుండెపోటుతో పరమపదించిన సంగతి తెలిసిందే. ఆయన మరణించి రెండు దశాబ్దాలు కావస్తున్నా, నేటికీ మల్కాపూర్ ప్రజల గుండెల్లో చెరగని ముద్రతో నిలిచే ఉన్నారు. సాధారణ కుటుంబం నుండి అసాధారణ నాయకుడిగా.. 1952లో పద్మశాలి కులానికి చెందిన వ్యవసాయ కూలీలుగా పనిచేసే లక్ష్మయ్య, లక్ష్మమ్మ దంపతుల ద్వితీయ సంతానంగా నర్సింలు గారు జన్మించారు. సంగారెడ్డిలో మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన ఆయన, శ్రీమతి వెంకటమ్మ గారిని వివాహం చేసుకున్నారు. వీరికి నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు (ప్రవీణ్ ప్రస్తుత ఉపసర్పంచ్) ఉన్నారు. మొదట మల్కాపూర్ పోలీస్ పటేల్‌గా, ఆ తర్వాత పట్వారీగా కొన్ని సంవత్సరాలు సేవలు అందించిన నర్సింలు, ఆ తర్వాత ప్రజా జీవితంలోకి అడుగుపెట్టారు.






ప్రజల ఆశీస్సులతో విజయ పరంపర

– 1988: గ్రామపంచాయతి సాధారణ ఎన్నికలలో మల్కాపూర్ గ్రామ సర్పంచ్‌గా భారీ విజయంతో రాజకీయ ప్రస్థానం ప్రారంభం.

– ?1995: మెరుగైన పాలనతో గుర్తింపు తెచ్చుకుని, తన సహచరిణి శ్రీమతి వెంకటమ్మ గారిని మల్కాపూర్ ాలి మహిళా సర్పంచ్‌గా భారీ మెజారిటీతో గెలిపించారు.– ?2001: మల్కాపూర్ మరియు గిర్మాపూర్ గ్రామాల నుండి కాంగ్రెస్ ఎం.పీ.టీ.సీ (వీూజ) గా విజయం సాధించి, కొండాపూర్ మండల వైస్ ఎం.పీ.పీ పదవిని అధిష్టించారు.

**గ్రామ అభివృద్ధిలో మైలురాళ్ళు..**

ఆయన పదవీకాలంలో మల్కాపూర్ రూపురేఖలు మారిపోయాయి. తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు మంచినీటి ట్యాంకుల నిర్మాణం, బోర్లు వేయించి ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇప్పించారు. కొత్త రోడ్ల నిర్మాణం, మురుగునీటి కాలువలు, విద్యుత్ సౌకర్యం కోసం ప్రత్యేకంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయించారు. అంతేకాకుండా, గ్రామస్తుల సహకారంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కోసం ఒక ఎకరం స్థలాన్ని సమీకరించి విద్యాభివృద్ధికి బాటలు వేశారు. ఎన్నో ఆటంకాలను ఎదుర్కొని ఆమ్లెట్ గ్రామమైన వీరభద్రుని పల్లెకు రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ముక్కుసూటి తనం.. న్యాయానికే పీఠం గ్రామంలో ఎలాంటి తగాదాలు జరిగినా పోలీస్ స్టేషన్ వరకు వెళ్లకుండా ఊర్లోనే పరిష్కరించేవారు. పంచాయితీల్లో ముక్కుసూటిగా మాట్లాడుతూ, కేవలం న్యాయం వైపు మాత్రమే నిలబడేవారు. తన హయాంలో పేదలకు సంపూర్ణ న్యాయం జరిగిందని, వారి జీవితాలు మెరుగయ్యాయని ఇప్పటికీ గ్రామ ప్రజలు గుర్తుచేసుకుంటుంటారు.

**తండ్రి ఆశయాల సాధనలో కుమారుడు 'ప్రవీణ్':**

జోగన్నగారి నర్సింలు గారి ఆశయాలను, ఆశీస్సులను ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన కుమారుడు ప్రవీణ్ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఐటీ రంగంలో మంచి భవిష్యత్తు ఉన్నప్పటికీ, దాదాపు 16 సంవత్సరాల అనుభవం కలిగిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ 'కాగ్నిజెంట్' (జశీస్త్రఅఱఓఅఖ్త్) మేనేజర్ ఉద్యోగానికి రాజీనామా చేసి మల్కాపూర్ ప్రజాసేవకు అంకితమయ్యారు. గత నాలుగేళ్లుగా ప్రజల్లోనే ఉంటూ సేవ చేస్తున్న ప్రవీణ్, ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానం రిజర్వేషన్ కలిసిరాకపోయినప్పటికీ, తండ్రిలాగే గ్రామానికి సేవ చేయాలనే పట్టుదలతో వార్డు సభ్యుడిగా పోటీ చేసి, ఆపై మల్కాపూర్ ఉపసర్పంచ్‌గా ఎన్నికై తండ్రికి తగ్గ తనయుడిగా నిలిచారు. జోగన్నగారి నర్సింలు 20వ వర్ధంతి సందర్భంగా మల్కాపూర్ గ్రామస్తులు, నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించనున్నారు.

# పేదలకు ఆరోగ్య భరోసా.. 'సీఎంఆర్ఎఫ్'

## 150 మంది లబ్ధిదారులకు రూ.44 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

## ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు అందజేత

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**

ఖమ్మం: కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులలో అత్యవసర వైద్య చికిత్సలు చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని గట్టయ్య సెంటర్ లో గల తన క్యాంప్ కార్యాలయంలో ఉభయ జిల్లాలైన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన 150 మంది లబ్ధిదారులకు తన సిఫారసుతో మంజూరైన రూ.44 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఆయన పంపిణీ చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి లతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ?ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ, లబ్ధిదారుల దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్క పేదవానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించి, అండగా నిలవడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులంతా ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

**ఆటో డ్రైవర్లు, కార్మికులకు అండగా ఉంటాం**

అనంతరం వివిధ ఆటో అడ్డాలకు చెందిన వందమంది ఆటో డ్రైవర్లకు ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ఖాకీ చొక్కాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో నిరంతరం శ్రమిస్తూ రవాణా రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో కార్మికులందరికీ తమ ప్రభుత్వం, తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని అభయమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో..: నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దీపక్ చౌదరి, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టెలిఫోన్ అడ్వైజర్ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, రంజిత్ నాయక్, సీనియర్ నాయకులు వడ్డెబోయిన నరసింహారావు, మాజీ ఎంపీపీ గోసు మధు, డీసీసీ సెక్రెటరీ రాంపుడి రోశయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ గుమ్మా రోశయ్య, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు ఎస్డి. గౌస్, కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, స్ఫూర్తి ఓం రాధాకృష్ణ, చల్లా రామకృష్ణా రెడ్డి, కేకేసీ జిల్లా అధ్యక్షులు విప్లవ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు జంగిపల్లి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు బాణాల లక్ష్మణ్, మల్లెల నాగేశ్వరరావు, కాటేపల్లి కిరణ్, ఉమర్, ఎండి. గౌస్, మాజీద్, చెరుకుమల్లి రవి, దిరిశెల శ్రీనివాసరావు, ఒంటికొమ్ము శ్రీనివాసరెడ్డి, ఏలూరి శ్రీనివాసరావు, ఉభయ జిల్లాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955